ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

ఆగస్టు 21, 2005

విలక్షణ దేశాధినేత

మన్మోహన్‌సింగ్

హ్యాపీ బర్త్‌డే

21.8.2005 నుంచి
27.8.2005 వరకు

జి. ప్రవల్లిక
1సం॥, ఆగస్టు-2004
సంతోష-సత్యనారాయణ
ఆరుట్ల- రంగారెడ్డి

కె. రజాక్
1సం॥, 21.8.2004
ఖాజ్‌బీ-రుక్ముద్దీన్
పాణ్యం-కర్నూలు

ఓల్గా
6 సం॥, 21.8.1999
దుర్గ-రామాంజనేయులు
ఏలూరు

బి. శ్రావణి
ఆగస్టు-21
యశోద-నరసింహులు
తనకల్లు-అనంతపురం

పి.వి. తేజశ్వి
3సం॥, 21.8.2002
లావణ్య-వెంకటేశ్వర్లు
పుల్లనీళ్లపల్లి-నెల్లూరు

వి.ప్రవల్లిక
4సం॥, 21.8.2001
రాణి-విజయ్ కుమార్
హైదరాబాద్

ఎ. మాణిక్య త్రివేణి
2సం॥, 22.8.2003
మస్తానమ్మ-వెంకటేశ్వరరెడ్డి
నాయుడుపాలెం-ప్రకాశం

గౌతమ్ షాహిల్
3సం॥, 22.8.2002
జెన్ని-సంజుబాబు
అంతర్వేదిపాలెం-తూ॥గో॥

కె. నవీన్
1సం॥, 23.8.2004
దమయంతి-ఉమాశంకర్
వజ్జిలపేట-శ్రీకాకుళం

బి. మేఘన
2సం॥, 23.8.2003
మణిశ్రీ-బాలకిషన్
సింగాపూర్-రంగారెడ్డి

ఎస్. వెంకట సునిత
3సం॥, 23.8.2002
సత్యవతి-సత్యనారాయణ
జిందాల్‌నగర్-విజయనగరం

శ్రీరామతులసి- లక్ష్మీప్రసన్న
7సం॥, 23.8.1998
హిమావతి-వెంకటరమణ
తోటపేట-తూ॥గో॥

ఎం. ఉదయకిరణ్
లలిత-యాదయ్య
హస్తినాపూర్-హైదరాబాద్

టి. అశోక్ కుమార్‌రెడ్డి
2సం॥, 24.8.2003
గోవిందమ్మ-ఆత్మానందరెడ్డి
కొత్తూరు-ప్రకాశం

డి. నవ్యశ్రీ
2సం॥, 24.8.2003
నాగమణి-నరసింహారావు
రాయగూడెం-ఖమ్మం

అరవింద కుమార్
8సం॥, 24.8.1997
మొగులమ్మ-నరసింహులు
పెద్దేముల్-రంగారెడ్డి

జి. జ్యోతి స్వరూప్
7సం॥, 25.8.1998
శ్రీలక్ష్మి-శ్రీనివాసరావు
అమీనాపేట-ఏలూరు

జె. సన్ని
ఆగస్టు-25
ఇందిర-డాని
బద్వీడు చెర్లపల్లి-ప్రకాశం

పి. జోసప్(చంటి)
2సం॥, 25.8.2003
నాగేశమ్మ-పెద్దవెంకయ్య
నాయుడుపాలెం-ప్రకాశం

యోగశ్రీ సాయి వర్మ
258.8.2004
రేఖావతి-బాలయ్య
కాపుగున్నేరి-చిత్తూరు

కె. స్రవంతి
2సం॥, ఆగస్టు-2003
లక్ష్మి-కృష్ణకుమార్
చోడవరం-విశాఖ

మరికొన్ని ఫొటోలు మూడవ కవర్ పేజీలో చూడండి

ఈ వారం అతిథి

నేతిబీర, పెరుగుతోట కాకూడదు!



మన అతిథి గురించి...

పేరు	-	దాశరథి రంగాచార్య
పుట్టిన ఊరు	-	వరంగల్‌జిల్లా, చిన గూడూరు
తేది	-	ఆగస్టు 24, 1928
విద్య	-	బి ఏ ఎల్‌ఎల్‌బి
నచ్చిన వ్యక్తి	-	మహాత్మా గాంధి
నచ్చని అంశం	-	దుర్మార్గం
హాబీ	-	రచన, అధ్యయనం

విలువలు, రాజకీయం, సమాజం వ్యక్తి సంస్కారం మీద ఆధారపడి ఉన్నాయి. ఉత్పత్తి విధానం మీద ఆధారపడి ఉన్నాయి. ఉత్పత్తివిధానాలు, సమాజమూ మారినప్పుడు విలువలు మారడమూ సహజమే. ఒక ఉత్పత్తివిధానం సమాజాన్ని పతనం చేసేదైతే విలువలు కూడా పతనమవుతాయి. దానికి ఏదో కొందరు వ్యక్తులు మాత్రమే మినహాయింపు. ప్రజలశక్తి రెక్కలను దుష్టులూ, దుర్మార్గులూ, రాక్షసులూ, విరగొట్టారు. రష్యాలో సోషలిజం పతనం మానవజాతి పతనం. ఈ భూమ్మీద రెండొందల దేశాలు సుమారుగా ఉన్నాయి. ఈ ప్రభుత్వాలన్నీ ఒకే అమెరికాకు దాసోహం అంటున్నాయి. ఆఫ్ఘనిస్తాన్ మీద దండెత్తినా, ఇరాకును సర్వనాశనం చేసినా ఒక దేశం కనీసం మూల్గలేదు. ఈ దాస్యప్రపంచంలో విలువలెలా ఉంటాయో మనం ఊహించడం కష్టంకాదు.

అమెరికా సాంకేతిక దాడి చేసి ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకుంది. బ్రిటన్ వలే యుద్ధాలు చేయలేదు. సాంకేతిక వ్యాపారంలో కూడా లాభాలు సంపాదిస్తోంది. ఈ అమెరికా విలువలే ఇవ్వాళ ప్రపంచ విలువలు. భారతదేశానికి విలువలనేవి చరిత్రకు చెందిన అంశం. అమెరికాది రాక్షస దాహం. ఈ ప్రపంచాన్ని మొత్తాన్ని మింగినా దాని ఆశ తీరదు. అమెరికా ఆశ ఆర్థికం. ఇవ్వాల్టి ప్రపంచ ఆశ కూడా ఆర్థికమే. ప్రపంచంలో ప్రజాస్వామ్యం నేతిబీర, పెరుగుతోట అయ్యింది. దేశంలో ప్రజలు కన్పించరు. ఓట్లు కొంటారు. సిద్ధాంతాలుండవు. వాగ్దానాలకు అంతులేదు. వీరే గద్దెనెక్కుతారు. లేదా వీరివంటివారే ఇంకొకడు గద్దెనెక్కుతారు. ఇది ప్రజల అభీష్టం మాత్రంకాదు. ఇది ధనపు, నేరపు అభీష్టం. ఇవ్వాళ ప్రపంచాన్ని ధనం, నేరం శాసిస్తున్నాయి కదా! అలాంటప్పుడు మనం మానవవిలువలు గురించి మాట్లాడ్డం కేవలం చారిత్రకం అవుతుంది. నాకు తెలిసిన ప్రపంచ చరిత్రలో ఇంతవరకూ మానవ విలువలు ఇంత నీచమైనవి, నికృష్టమైనవి చూడలేదు. విచిత్రమేమంటే మనిషికి మనిషి శత్రువుకాదు. మనిషిలోనే మనిషి శత్రువున్నాడు. మహాత్ముడు, లెనిన్, మావో, చర్చిల్, రూజ్‌వెల్ట్, హోచిమన్ వంటి మహామహులు మానవతావిలువలు తెలిసినవారు మళ్లీ ఈ సమాజంలో పుట్టరు. కాబట్టి విలువలు పతనమవుతన్నాయని కన్నీరు కార్చవలసిందే తప్ప ఉద్యమాలు తెచ్చే శక్తి ఎవరికీ లేకుండాపోయింది.

హిరణ్యాక్షుడు నుంచి నేటిదాకా ప్రపంచాన్ని మింగాలనిచెప్పి అనేకమంది వచ్చారు. అందరూ నాశనమయినారు. కాబట్టి ఆ మింగజూసే అమెరికా ఆర్థికశక్తి కూడా బీటలు వారుతున్నది. అమెరికా పతనం ఖాయం. ఎప్పుడు అనేది చెప్పలేం. ఊహ మాత్రం కాదు. బ్రిటన్ కూలింది. హిట్లర్ కూలాడు. సోషలిస్ట్ సామ్రాజ్యం కూలింది. ప్రకృతి నియమం ప్రకారం ఏదీ స్థిరం కాదు. ఎవరో మహాత్ముని వంటివారు వచ్చి ఈ ఉత్పత్తి విధానాన్ని మార్చి, మానవ విలువల్ని ఉద్ధరిస్తారు. ఎందుకంటే ఇది చరిత్ర చెపుతున్న పాఠం.

మానవవిలువలు వర్ధిల్లాలి! దాశరథి రంగాచార్య

ఈ సంచికలో...

టపా ...	2
టర్నింగ్‌పాయింట్	4
సలహాలు ...	5
ఇంటి సంగతులు ...	6
నేర్చుకుందాం..రా! ...	7
క్యాంపస్ చాట్ ...	10
సినిమా కబుర్లు ...	11
బాలనేస్తాలు ...	12
అట్టమీది కథ ...	14
తెంగ్లీషు ...	20
ఓ ఊరి కథ ...	21

సీరియల్ 8 మాధవి

ఇంకా,,,

మనసా తెలుసా 3
ప్రేమలోను వెరైటీ... వెరైటీస్...!

చెదిరిన జ్ఞాపకాలు
కథ ... 18

ఆరోగ్యం ...	17
పప్పెట్ ఇంటర్వ్యూ ...	19
అవీ... ఇవీ	22
విజ్ఞానవీచిక ...	23
కొత్త పుస్తకాలు ...	24

టపా

కారులు 'షి'కార్లు

"స్నేహ" సంచికలో ప్రచురించిన అట్టమీది కథ "కారులు 'షి'కార్లు" చాలా బాగుంది. డ్రైవ్ చేసేటప్పుడు మహిళలు ఏదుర్కుంటున్న సమస్యల గురించి వివరించడం ఆసక్తికరంగా ఉంది.

రమణ, తాడేపల్లి గూడెం

ఆకలి కడుపు నీతి

"ఆకలి కడుపు నీతి" కథ చాలా ఆసక్తికరంగా సాగింది. చివరి వరకు ఉత్కంఠంగా చదివించింది. ప్రజలకుపయోగపడని బందులు నిర్వహించడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను చక్కగా వివరించిందీ కథ. ప్రతి మనిషిలోనూ నిజాయితీ దాగుంటుందని తెలిపింది.

సుమ, మెదక్

మాధవి

"మాధవి" సీరియల్ కోసం మేం ప్రతి వారమూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తాం. తన తండ్రి నిర్ణయం మాధవినెంత వేదనకు గురిచేసిందో చాలా చక్కగా వివరించారు. ఇందులోని ప్రతి సన్నివేశమూ కళ్లకు కట్టినట్లుగా ఉంది.

జగదీశ్వరి, ప్రకాశం జిల్లా

ఎన్‌ఫీల్డ్ రైఫిల్

"టర్నింగ్ పాయింట్" శీర్షికలోని "ఆంగ్లేయులకు తొలిదెబ్బ ఎన్‌ఫీల్డ్ రైఫిల్" మమ్మల్నెంతో ఆకట్టుకుంది. 1857లో సిపాయిల తిరుగుబాటు మన భారత దేశ చరిత్రలోనే ఓ మైలురాయి. ఇది ఆంగ్లేయుల పునాదులను కదిపిందన్న సత్యాన్ని చాలా చక్కగా వివరించారు.

వెంకట్, కరీంనగర్

సినిమా కబుర్లు

"చిన్నపాత్రయినా.... దమ్ముండాలి" చాలా స్ఫూర్తిదాయకంగా ఉంది. ప్రేక్షకాదరణ పొందాలంటే ఏ నటుడైనా దమ్ముండే పాత్రలను పోషించడం తప్పనిసరన్న విషయాన్ని సుత్తివేలు మాటలు మరోసారి గుర్తుచేశాయి.

రవి, నీలిమ, అవనిగడ్డ

చాలా బాగున్నాయి

ఆదివారం అనుబంధంలో 'ఆరోగ్యం' శీర్షిక చాలాబాగుంది. పాఠకులను బాగా ఆకట్టుకుంటుంది. బాలల కథ, న్యాయసలహాలు శీర్షికలు ఎంతో బాగున్నాయి. కథ చాలా బాగుంది.

లావణ్య, గుడివాడ

న్యాయసలహాలు

ప్రతివారం ప్రచురిస్తున్న "న్యాయసలహాలు" శీర్షిక పాఠకులకెంతో ఉపయోగకరంగా ఉంటోంది. "హ్యాపీ బర్త్‌డే" శీర్షికలో చిన్నారుల ఫోటోలు అందంగా, ఆకర్షణీయంగా ముద్రిస్తున్నారు. స్నేహ సంచికలో జోక్స్ చాలా బాగున్నాయి. పదేపదే చదువుకుని నవ్వుకున్నాం. ఇలాంటివి మరెన్నో ప్రచురించాలని కోరుకుం టున్నాం. 'అవీ ఇవీ' పేజీ చాలా ఆసక్తికరంగా ఉంది.

లత, కడప

మనసా... తెలుసా?

ప్రేమలోను వెరైటీ... వెరైటీస్...!



హిప్నో కమలాకర్
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్
పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్

> ***రొమాంటిక్ లవ్ అన్నది ఒక విధంగా, కాల్పనిక వస్తువుతో మమేకం కాగల ప్రేమకు అనువదించుకోవచ్చు. మనుషుల మధ్య, ముఖ్యంగా యువకుల మధ్య ఈ విధమైన కాల్పనిక ప్రేమ పుడుతుందని భావించడం, ఆధునీకరించిన దృక్పథానికి ఊతనిస్తూంది. ఇది ప్రేమ అనే భావన తత్వవేత్తలకు, వేదాంతులకు మాత్రమే పరిమితమై పోకుండా అందరికీ సంబంధించిన విషయంగా ఉపయోగపడ్తుంది.***

అడవులు, పంటలు, పరిశ్రమలు, ప్రభుత్వాలు వంటి అంశాలలో రకారకాలున్నట్టే "ప్రేమలో కూడా రకాలుంటాయా ?" అని కొంత మంది విచిత్రంగా ప్రశ్నించవచ్చు. ఎప్పుడైనా అది శాశ్వతమైనది, సుస్థిరమైనది, చెదిరిపోనిది, చెరిగిపోనిది, అని వేదాంత ధోరణిలో పలువురు మేధావులు అభివర్ణించినా వాక్యాలను దుర్భేధ్యమైన సాక్ష్యాలుగా తీసుకుని ప్రేమలో రకాలుండమేమిటని, ఇదెక్కడి చోద్యమని ముక్కుమీద వేలు వేసుకోవచ్చు. షేక్స్‌పియర్ లాంటి మహారచయితల తత్వ పరిశోధన, పరిశీలానాత్మకత దన్ను ఉంది కాబట్టి ముక్కున వేలేసుకున్న వ్యక్తుల మాట నిజమేనని ఒప్పుకోవచ్చు కానీ, పాశ్చాత్య నాగరికత ప్రభావం కారణం చేత ఏర్పడే చిత్ర విచిత్రమైన టీనేజి మనోభావాల వివిధ ప్రక్రియల అన్నిటికీ, ఉత్తేజ భరితమైన వారి చేష్టలన్నిటికి వేరు వేరు అర్థాలు స్పష్టంగా గోచరిస్తున్నప్పటికీ అందరు వాటన్నిటినీ ప్రేమే సుమా ! అని వర్ణించే ధైర్యం చేస్తున్న నేటి సామాజిక నేపథ్యంలో టీనేజ్ సైకాలజీ వెర్సస్ ప్రేమ వ్యవహారాలను విశ్లేషించడానికి తప్పనిసరిగా రకరకాల ప్రేమల గురించి ప్రస్తావించక తప్పదు.

ప్లేటోనిక్ లవ్ : సోక్రటీస్ అనుచరుడైన ప్లేటో మనుషుల మధ్య బాంధవ్యాన్ని పెంపొందించే ప్రేమ విశిష్టతను తెలుసుకోవటానికి ప్రయత్నించాడు. ఆ మేరకు ఆయన పలు ప్రాంతాలలో పరిశోధనలు చేశాడు. స్త్రీ పురుషుల మధ్య శృంగార ప్రసక్తి లేకుండా సాగే దగ్గరతనాన్ని అత్యుత్తమమైన ప్రేమని ప్లేటో సిద్ధాంతీకరించాడు. దీనినే తెలుగులో ప్లేటోనిక్ లవ్ అంటారు. దీనిని మన తెలుగులో అమలిన శృంగారం అని భాషావేత్తలు అనువదించారు. ప్రస్తుత సమాజంలో చెట్టాపట్టాలేసుకుని తిరిగే టీనేజ్ పిల్లల మధ్య ఇటువంటి ఉదాత్తమైన ప్రేమ ఉంటుందా అని వెతకటం నేతి బీరకాయలో నెయ్యిని ఆరాతీయడమే అవుతుంది. హార్మోన్ల ప్రభావం చేత లైంగిక మనోభావాలకు గురై విజాతి వ్యక్తుల సంపర్కం కోసం తహతహలాడే సమయం యుక్తవయసు. ఆ స్థితిలో ఉన్న యువతీ యువకులు ఫ్రెండ్‌షిప్ డే పేరు చెప్పి చేతులకు బ్యాండ్లు తగిలించుకుంటారు. ఆ తరువాత రాబోయే వాలంటైన్స్ డే రోజున ప్రేమ పత్రాలను పంచుకోవడానికి సిద్ధ పడబోయే యువ జంట చేసే తొలి చర్యగానే భావించాలే తప్ప, ఈ విజాతి యుక్త వయస్కుల నడుమ రాయప్రోలు సుబ్బారావు గారు వర్ణించిన అమలిన శృంగారం లేదా ప్లేటోనిక్ లవ్ ఉందని కచ్చితంగా అనుకోలేం. ఏమైనప్పటికీ ప్రేమలో ఇది ఒక నాణ్యత కుచెందిన పరిపూర్ణమైన రకం. "వన్స్ ఇన్ ఎ బ్లూ మూన్" లా ఇటువంటి ఉదాత్తమమైన అత్యుత్తమ శ్రేణికి చెందిన ప్రేమ మనకు ఎప్పుడో ఒకప్పుడు కనిపించక పోదు.

రొమాంటిక్ లవ్ :

మన వ్యవహార భాషలో "రొమాన్స్" అంటేనే లవ్ అని అర్థం. వాస్తవానికి రొమాంటిక్ అంటే కల్పితమైనది అని అర్థం. ఒక అద్భుతమైన కల్పనా వస్తువును రొమాంటిక్‌గా వుందని సాహితీవేత్తలు వర్ణిస్తారు. కవుల ఉత్పత్తులలోను, కవితా భావాలలోను, ఈ రొమాంటిక్ పదం యొక్క ప్రాముఖ్యత 18వ శతాబ్దంలో వచ్చింది. అంతకు ముందు కవిత్వం వాస్తవ మానవ జీవితాన్ని మాత్రమే ప్రతిబింబిస్తూ సాగేది. ఆంగ్ల భాషకు పరిపోషణ లభించిన, ఇంగ్లాండు మరియు యూరప్ దేశాలలో, కవిత్వం ఒక సాహితీ ప్రక్రియగా భాసిల్లింది. ఆ సమయంలో కవితలు, నాటకాలు, రచనలు ముమ్మరంగా సాగాయి. అప్పటి సాహితీవేత్తలు, మానవ వర్తమాన జీవనశైలిని ప్రతిబింబిస్తూ, తమతమ సాహితీ పోకడలను మాధ్యమంగా ఎంచుకుని రచనలు చేసేవారు. ఒక కవిత్వం తీసుకోండి, ఒక కథానిక తీసుకోండి. అప్పటి సామాజిక వాతావరణ పరిస్థితులు మనకు కళ్ళకు కట్టినట్లుగా కన్పిస్తాయి. కాగా 18వ శతాబ్దంలో విలియం బ్లేక్, విలియం వర్డ్స్‌వర్త్ (వీరిని రొమాంటిక్ స్కూల్‌కు చెందిన వాళ్ళని చెప్తుంటారు) వంటి వాళ్ళు తమ కవిత్వాలలో కల్పనలకు తావిచ్చారు. సాహిత్యంలో అప్పుడది ఒక వినూత్నమైన ప్రయోగం. కవి మనసులో ఏర్పడే ఒక కాల్పనిక వస్తువునే కథా వస్తువుగా తీసుకుని కవితను అల్లటం జరిగింది. ఆది ఒక అద్భుతమైన ప్రయోగం, కళాకారులలో వుండే సృజనాత్మకతను (క్రియేటివిటీని) వెలికి తీసి చైతన్యపరిచే ప్రయోగం. దీనికి పాఠకుల నుండి మంచి రెస్పాన్సు వచ్చింది. మనం ఆ పోకడలను ఎమర్సన్, కీట్స్ పదాలలోనూ గమనించవచ్చు. పదప్రయోగం, భాషా పరిజ్ఞానం ఒక చక్కని ఊహతో మేళవించి, కవితారూపం దాల్చటం, పాఠకుల మనసులను రంజింప చేసింది. పాఠకులను రంజింప చేయడానికి ఈ కాల్పనిక వస్తువు ప్రధాన పాత్ర పోషించడంతో, కవితా ప్రయోగాలలో రొమాంటిక్ వస్తువులను తీసుకోవడం ఆ తరువాత తరం వారికి పరిపాటి అయ్యింది. సృజనాత్మకతకు పెద్ద పీట వేసే ఈ రొమాంటిక్ అనే పదం సాహిత్యానికి సంబంధించిన పదం. ఈ పదాన్ని ఆధునిక ప్రేమ కథలకు అపాదిస్తూ రొమాటిక్ లవ్ అనే కొత్తరకం ప్రేమ పుట్టింది. నిత్య జీవితంలో మనం ప్రేమకు సంబంధించి ఏ వ్యవహారానైనా సరే రొమాన్స్ గానే వర్ణిస్తాం. ఈ పదంలో వున్న "కాల్పనిక" అనే విశేషణం, తొలియవ్వనదశకు అప్పుడే ప్రవేశించిన యువతీ యువకుల మనస్సులో ఏర్పడే కల్పిత భావాలకు సరిగ్గా సరిపోతుంది. ✤

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

ఫ్రెంచి దేశపు సామాన్యుల తరుపు ప్రతినిధులైన మూడవ ఎస్టేట్ సభ్యులు రాకుండా చేయడానికి సమావేశ భవనానికి రిపేర్ల పేరిట తాళం వేశారు. ఆ పక్కనే వున్న టెన్నిస్ కోర్టులో కెళ్లారు. ఆ టెన్నిస్‌కోర్టు చారిత్రక మలుపులోకి కారణమయ్యిందో ఇది చదవండి.

వారేవ్వా... టెన్నిస్ కోర్టు

18వ శతాబ్దంలో మూడు విప్లవాలు జరిగాయి. అవి పారిశ్రామిక, అమెరికన్, ఫ్రెంచి విప్లవాలు, ఇందులో ఫ్రెంచి విప్లవం అత్యంత ప్రాధాన్యతను పొందింది. కేవలం రాజకీయ విప్లవం కాకుండా, ఆర్థిక, అంతర్జాతీయ పరిణామాలకు ఇది దోహదం చేసింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం- నినాదాలు ఫ్రెంచి విప్లవం చేపట్టింది అందుకు ఒక "టెన్నిస్ కోర్టు" వేదికవ్వడం విచిత్రం.

అన్ని విప్లవాలకు మల్లే, ఫ్రెంచి విప్లవానికి, వివిధ రాజకీయ, ఆర్థిక సామాజిక కారణాలున్నా వాటిలో ముఖ్యమైనది నిరంకుశ రాజరికం. దీనికి ప్రజల దుర్భర ఆర్థిక పరిస్థితులు తోడయ్యాయి. రాచరిక వ్యతిరేకత తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆర్థికంగా, ప్రభుత్వం దివాళా తీసి, తీవ్ర సంక్షోభంలో పడింది. ఫ్రాన్స్ దేశాన్ని పరిపాలిస్తున్న బౌర్బన్ రాజ వంశీకుల గుర్చి చరిత్రలో ఒక నానుడి వాడుకలోకి వచ్చింది. ("బౌర్బన్ రాజులు గతాన్ని మర్చిపోయింది లేదు. గత అనుభాల నుండి నేర్చుకొన్నదీ లేదు). దేశం ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయట పడాలంటే ఒకటే మార్గం ఫ్రెంచి పార్లమెంటును సమావేశపర్చాలి. పార్లమెంటు శాసనాల ద్వారానే, కొత్త పన్నులు విధించాలి. ఫ్రెంచి పార్లమెంటు ఎస్టేట్స్ జనరల్ 175 సంవత్సరాలు పార్లమెంటును సమావేశ పరచకుండానే పబ్బంగడుపుకొంది. ఫ్రెంచి రాజరికం పరిస్థితులు విషమించడంతో పార్లమెంటును పిలవక తప్పలేదు. ఫలితంగా 1789వ సంవత్సరం మే నెల 5వ తేదీ నాడు సమావేశమవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది.

మూడంతస్తుల, నిచ్చెన మెట్ల పార్లమెంట్ స్టేట్స్ జనరల్



(పార్లమెంటు) మూడు వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ మూడింటిని మూడు ఎస్టేట్స్‌గా పిలుస్తారు. మొదటిది ప్రభువర్గం, రెండవది మత వర్గం, కాగా మూడవది సామాన్యుల వర్గం. మొదటి రెండు వర్గాలకు కలిపి, పార్లమెంటులో 600 మంది సభ్యులుండగా, మూడవ ఎస్టేట్‌లో 600 పైగా వున్నారు. మూడు వర్గాలకు వర్గప్రాతిపదికపై మూడు ఓట్లు. గతంలో ప్రభువర్గం, మత వర్గంతో చేతులు కలిపి, తనకున్న రెండు ఓట్లతో, మూడవ ఎస్టేట్‌పై ఆధిక్యాన్ని సాధించి, సామాన్యుల వర్గాన్ని తమ సమస్యల పరిష్కారానికి తోడ్పడకుండా ఓడించేవారు. కానీ, ఈ సారి మూడవ



ఎస్టేట్ సభ్యులు, ప్రజల విజ్ఞాపనలు తీసుకొని, వాటి పరిష్కారం కోసం తుదికంటా నిలబడి పోరాడాలని గట్టిగా అనుకుని వచ్చారు. పార్లమెంట్‌లో ఎస్టేట్ల వారీగా కాకుండా తలకొక్క ఓటు లెక్కన పరిగణించాలని తీర్మానించారు. దీంతో మొదటి రెండు ఎస్టేట్ల గొంతులో వెలక్కాయ పడినట్లయింది. ఎస్టేట్స్ జనరల్ సమావేశంలో, కొన్ని తీర్మానాలు ఆమోదించాలని పట్టు బట్టారు. ఫ్రాన్స్ దేశపురాజు, పదహారవ లూయీకి ఇది ససేమిరా నచ్చలేదు. ఆ రోజు చేసిన తీర్మానాల్లో, నిరంకుశత్వం నశించి, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని సాధించే రాజ్యాంగాన్ని ఏర్పర్చాలన్నారు. పార్లమెంట్ క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాల్సిందేనన్నారు. పన్నులు విధించి వసూలు చేసే హక్కు స్టేట్స్ జనరల్‌కే ఉండాలని కోరారు. పన్నుల చెల్లింపులో ఎవరికీ మినహాయింపులుండరాదనీ కోరారు. ప్రభు వర్గానికి సామాన్యులు ఏ విధమైన నజరానాలూ చెల్లించనవసరం లేదని తీర్మానించారు. రాజు ఎడల విధేయత ప్రకటిన్నూ పార్లమెంటును సమావేశపరిచినందుకు కృతజ్ఞత తెలిపారు. ఆ తర్వాత నిర్వహించే సమావేశాల్లో మిగతా అంశాలు చర్చించాలనుకొని ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఈ తీర్మానాలను మొదటి రెండు ఎస్టేట్లు అంగీకరించలేదు. ప్రతి సభ్యుడికి ఒక ఓటు అనే నిర్ణయాన్ని ఆమోదిస్తే, తమ ఆధిపత్యం పోతుందని భావించి పార్లమెంటు సమావేశాల్లో, మూడవ ఎస్టేట్‌తో కలిసి కూర్చొని నిర్ణయాలు చేయడాన్ని ఒప్పుకోలేదు. ఫలితంగా మూడవ ఎస్టేట్ తనను జాతీయ అసెంబ్లీగా ప్రకటించుకొంది. ఫ్రెంచి విప్లవానికిది మొదటి మెట్టు.

దీనికి మరో ఘటన, విప్లవారంభానికి దోహదం చేసింది. జాతీయ అసెంబ్లీగా ప్రకటించుకొన్న మూడవ ఎస్టేట్ సభ్యులు 1789న జూన్ 20వ తేదీ నాడు తాము అంతకు ముందు సమావేశమై భవనానికెళ్ళారు. భవనం తలుపులు మూసున్నాయి. రిపేర్లు, ఇతరత్రా ఏర్పాట్లు జరుగుతున్నాయన్న బోర్డు ఆ భవన ద్వారాలకు వేలాడేశారు. ఇది చూసి సభ్యులు ఖంగు తిన్నారు. అంతరార్థం అర్థమైంది. మూడవ ఎస్టేట్ సభ్యులు హాజరు కాకుండా చేయడానికి పన్నిన పన్నుగడగా భావించారు. వారు వెంటనే పక్కన ఆవరణలో వున్న టెన్నిస్ కోర్టులో సమావేశం జరిపి తమ అధ్యక్షుడు బెయిలీ నాయకత్వంలో శపథం చేశారు. తాము ఎప్పుడూ, ఏ క్లిష్ట పరిస్థితుల్లోనూ విడిపోరాదని. కొత్త రాజ్యాంగం రచించే వరకూ సంఘటితమై వుంటామనీ, సభ్యులందరూ, ప్రతిన బూనారు. దీంతో ఫ్రెంచి విప్లవమారంభమయింది. టెన్నిస్ కోర్టు శపథం ఫ్రెంచి విప్లవారంభానికి నాందిపలికి, ప్రపంచ చరిత్రనే మలుపు తిప్పింది. ✤

సమాన హక్కుంటుంది

మాకు రెండు సెంట్లు స్థలముంది. దానికి పట్టా లేదు. మా తాతల కాలం నుంచి ఉంటున్నాం. మా తాతకు ఇద్దరు కొడుకులు. ఈ రెండు సెంట్లలో మా తాత ఒక సెంట్ కొన్నాడు. వాళ్ళ అన్నల దగ్గర అలా కొన్నట్టుగా మాతాత పేరుమీద రిజిష్టర్ అయ్యింది. నేను మా తాత పెద్ద కొడుకు కొడుకును. మా బాబాయికి పిల్లల్లేరు. పది సంవత్సరాలకి మా పిన్ని బాబాయిని వదిలేసింది. తరువాత ఆయన చనిపోయారు. ప్రస్తుతం ఆస్తిలో వాటా ఇవ్వాలనడుగుతోంది. ఆస్తి ఆమె భర్త సంపాదించలేదు. మా తాత సంపాదించినది. నేను కోర్టుకెళ్లెందుకేమైనా అవకాశాలు ఉన్నాయా? తెలుపగలరు.

జి.నిరీక్షణరావు, అచ్చంపేట.

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

డబ్బు వస్తుంది

నేను టొబాకో కంపెనీలో క్లర్కుగా గత **1-4-1991** నుంచి **1999** వరకు పని చేశాను. కంపెనీవారు ఆకస్మాత్తుగా **1999**వ సంవత్సరంలో ఇక్కడి బ్రాంచిని తొలగించారు. నేను **2003** సంవత్సరంలో లేబర్ కోర్టునాశ్రయించాను. వాళ్లన్ని విధాలా పరిశీలించి, తగిన చర్య తీసుకుంటామన్నారు ఇప్పటి వరకూ నాకెటువంటి న్యాయమూ అందలేదు. సరైన సలహా ఇవ్వగలరు.

బడ్డోల్ల గంగారాజ్
జోగిపేట మెదక్‌జిల్లా.

మీ ఆస్థి తాతల నాటిది (పిత్రార్జితం).కావున మీ తాతాయ్య వారసులుగా నాన్నగార్కి మీ బాబాయి గార్కి సమాన హక్కుంటుంది. మీ బాబాయి వారసురాలుగా ఆస్థి హక్కు ఆయన భార్యగా మీ పిన్నిగార్కిహక్కుఉంటుంది. వారిరువురూ విడిపపోయి చానాళ్లయినా, వారి వివాహం చట్ట ప్రకారం రద్దు కాలేదు. కాబట్టి ఆమె మీ బాబాయి గారి వాటాకు హక్కుదారీ. మీరు కోర్టుకెళ్లినా తీర్పు మీ వైపు రాదు

మీరు పర్మనెంట్ ఎంప్లాయా, టెంపరరీగా ఏర్పాటైనవారా తెలుపలేదు. అంతే కాకుండా, సీజనల్ వైజా లేదా పూర్తి కాలం పని చేసే వారా కూడా తెలుపలేదు. ఒక వేళ మీరు పర్మినెంటయి, అన్ని అర్హతలూ కలిగి ఉన్నా మీకు నోటీసివ్వకుండా తొలగించినట్లయితే మీరు ఈ పాటికే లేబర్ కోర్టు నాశ్రయించారు. కాబట్టి చట్ట ప్రకారం మీకు రావలసిన నగదు వస్తుంది. లేబర్ కోర్టులో మీ కేసు పరిస్థితిని వేగిరపరచండి.

అబ్బే...వదలను

ఒకావిడ మిట్ట మధ్యాహ్నం కోడి పిల్లల్ని బుట్ట కింద కమ్మి పెట్టింది దారినపోయే దానయ్య అది చూసి " ఎందుకమ్మా వాటినలా ఉంచావు వదిలేస్తే సాయంత్రానికి తిరిగొచ్చేస్తాయి కదా" అన్నాడు.

దానికావిడ "అమ్మో వదిలేస్తే దేని ఇంటికి అది వెళ్ళిపోతుంది" అంది మెల్లగా

పెండెం జగదీశ్వర్.

ఇంటి సంగతులు

ఉంచుకోండి తాజాగా

పి. జ్యోతి

ఉదయం లేస్తూనే వంట గదిలోకి దూరిపోయి వంటపని పూర్తిచేసెయ్యాలి. పిల్లలుంటే వారికి లంచ్‌బాక్సులు, ఆ తరువాత పెద్దవాళ్లం బయటికి వెళ్లాలంటే బాక్సులు సిద్ధం చేసుకుని, తొమ్మిందింటికల్లా బయల్దేరాల్సిందే. ఇలాంటప్పుడు ఏ కూరలబ్బో వస్తే అతని దగ్గర కొని వండాలంటే ఇక మన పని అయినట్టే.

అలాకాకుండా ఇంట్లో కూరగాయలు రెడీగా ఉంటే సమస్యుండదు. అందుకనే వారానికి సరిపడా మార్కెట్టు నుంచి రకరకాల కూరగాయలు ఒకేసారి తెచ్చుకోవాలి. కానీ ఇవి వారం రోజుల వరకూ అలాగే ఉండవు. వాడిపోతాయి. అందుకే ఇవి ఎప్పుడూ తాజాగా ఉండేలా జాగ్రత్త పడాలి.

ముందుగా... ఆకుకూరలు

ఆరోగ్యానికి ఆకుకూరలెంతో మంచివి. ఈ విషయమందరికీ తెలిసిందే. అంతేకాకుండా ఇవి చౌకగానూ లభిస్తాయి. కాబట్టి పేదా గొప్ప అన్న తేడా లేకుండా అందరం కొనుక్కుని తినొచ్చు. కాకపోతే రోజుకోరకం వండుకుంటే విసుగులేకుండా తినొచ్చు. ఎలాగంటే ఓ రోజు పచ్చడి, మర్రోజు పప్పు, ఇంకో రోజు కూర. ఇలా వెరైటీగా వండొచ్చు. అప్పుడే ఇంట్లో వారందరూ ఇష్టంగా తింటారు. ఆరోగ్యానికి ఆరోగ్యం, రుచికి రుచీ రెండూ దక్కుతాయి.

తాజాగా ఉండాలంటే...

ఇవి చాలా త్వరగా వడలిపోతాయి. అందుకే వీటిని తెస్తూనే పాలిథీన్ కవరులో పెట్టి, గట్టిగా మూటకట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. వంట వండేముందు ఉప్పు కలిపిన నీటిలో కాసేపు ఉంచాలి. దీని వల్ల పురుగులు చచ్చిపోతాయి. ఆకుకూరలు తాజాగా అవుతాయి.

కొత్తిమీర

దీనిని హోల్స్ ఉన్న ప్లాస్టిక్ డబ్బాలో గానీ, తడిలేని స్టీలు డబ్బాలోగానీ పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. అప్పుడే పాడవదు.

కరివేపాకు

పాలిథిన్ కవర్లో పెట్టిగానీ లేదా గాజుసీసాలో పెట్టిగానీ మూతవేసి ఉంచితే ఎన్నిరోజులైనా బాగుంటుంది. దీని వల్ల ఏ వంటైనా ఘుమ ఘుమలాడుతుంది.



పచ్చి మిరపకాయలు

వీటి తొడిమలు తీసేయాలి. ఏదైనా గాజుసీసాలో కాస్త ఉప్పు చల్లి అందులో వేసి మూతబిగించాలి. ఈ గాజుసీసాను రిఫ్రిజిరేటరులో ఉంచితే.... ఈ పచ్చి మిరపకాయలు పచ్చగా నిగనిగలాడుతూ ఎన్ని రోజులైనా అలాగే ఉంటాయి. మరివి కూరల్లోకి, పుప్పులోకి, పచ్చడిలోకి అసలు ఒక్క ఐటమ్ అని కాదు అన్నింటికీ ఉపయోగపడతాయి.

వారానికి సరిపడా ఒకేసారి మార్కెట్టు నుంచి రకరకాల కూరగాయలు తెచ్చుకోవాలి. అందుకే ఇవి ఎప్పుడూ తాజాగా ఉండేలా జాగ్రత్త పడాలి. అందుకేం చేస్తే బాగుంటుందబ్బా !

నిమ్మకాయలు

ఇవి రోజూ ఏదో ఒకరకంగా వాడుకోవచ్చు. వంటలోకే కాదు, జ్యూస్‌లానూ వాడుకోవచ్చు. వీటినొక పాలిథీన్ కవర్లో వేసి ఫ్రిజ్‌లో ఉంచితే తాజాగా ఉంటాయి.

కాయగూరలు

కూరగాయలను ఏ పూటకాపూట వండుకుని తింటే చాలా బాగుంటుంది. పొద్దుట వండిన కూర రాత్రికి రుచిగా అనిపించదు. దాంతో మనకి తినాలనిపించదు. కాబట్టి రకరకాల కూరగాయలు తెచ్చుకుని ఉంచుకుంటే పూటకోరకంగా వండుకోవచ్చు.

నిల్వచేసే విధానం

వేటికవి వేరుచేసి ఒక్కో రకాన్ని ఒక్కో పాలిథిన్ కవర్లో లేదా ప్లాస్టిక్ బాక్సులో వేసి మూతపెట్టేసి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. ఫ్రిజ్ లేకపోతే తడిబట్ట కప్పితే తాజాగా ఉంటాయి.

క్యారెట్స్ అయితే రెండువైపులా కట్ చేసి ఫ్రిజ్‌లో ఉంచితే బావుంటాయి. బెండకాయల మొదళ్లు కట్ చేసి పెట్టుకుంటే ముదిరిపోకుండా ఉంటాయి. ఈ రోజుల్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. అందువల్ల వారానికి సరిపడేట్లుగా తెచ్చుకున్న కూరలను శ్రద్ధగా జాగ్రత్త చేసుకోవాలి. అప్పుడే ఇవి తాజాగా ఉంటాయి.

సండే డెస్క్

గొలుసు కుట్టు ఎలాగంటే...





క్రిందటివారం క్రోషియా అల్లికల గురించి, సూదులు, దారబ్బంతులు గురించి తెలుసుకున్నాం కదా...ఎలా అల్లుకోవచ్చో చూద్దాం.

రాములమ్మ నేర్చుకునే స్థాయిలో ఉంది కాబట్టి ముతకదారమే కొనుక్కొంది. 100 గ్రాముల దారం 20 రూపాయలు, సూది 4 రూపాయలయ్యింది.

మరునాడు కుట్టు సెంటరుకు పోయేటప్పుడు రాములమ్మ చుట్టలా వున్న దారాన్ని గుండ్రంగా బంతిలా చుట్టుకుంది. సూదులు, దారం, ఒక నోటు పుస్తకమూ, పెన్నూ తీసుకుపోయింది.



లక్ష్మీ టీచరు, రాములమ్మకు ముందుగా గొలుసుకుట్టును గురించి నేర్పింది. ఏ డిజైను వేయడానికైనా ఈ గొలుసులే ఆధారం. (గొలుసుకుట్టు అల్లేటప్పుడు సూదిపైన దారం జారకుండా చూసుకోవాలి)



దారానికి ఒక చివరను ఎడమచేయి చిటికెనవేలూ చూపుడు వేలూ మీదుగా తీసుకోవాలి. ఎడమచేయి మధ్య వేలు బొటన వేలుతో ఇంకో కొసను పట్టుకోవాలి. కుడిచేతితో సూదిని పట్టుకొని హుక్‌తో బాణం గుర్తు ఉన్న దిశగా తిప్పాలి.



అప్పుడు సూది చుట్టూ దారం జారు ముడిలా బిగుస్తుంది.

ఆ ముడిలో నుండి దారాన్ని గట్టిగా లాగాలి. అప్పుడది ముడిలా బిగుస్తుంది.



సూది మీద మిగిలిన దారం నుండి దారాన్ని లాగితే అది ఒక గొలుసవుతుంది.

లాగిన గొలుసులో నుండి మళ్లీ ఇంకొక గొలుసు లాగాలి. ఇలా వరుసగా కావలసిన గొలుసులు డిజైనును బట్టి వేసుకోవచ్చు.

సింగిల్ క్రోషియో ఎలా అల్లాలో చూద్దాం.



1. పైన చెప్పిన విధంగా మొదట 10 గొలుసులు వేసుకోవాలి.
2. తొమ్మిదవ గొలుసులో నుండి దారాన్ని పైకి లాగాలి.
3. లాగిన దారం, పదవ గొలుసు మొత్తం రెండు గొలుసులు సూదిపైన ఉంటాయి.



ఆ రెండు గొలుసుల్లో నుండి ఒకేసారి దారాన్ని లాగాలి. అలా లాగితే మొదటి వరుస గొలుసు పైన ఇంకొక గొలుసు తయారవుతుంది.



ఆ విధంగా కింది పది గొలుసులలో నుండి దారాన్ని లాగి వరుస పూర్తిచేసి తిప్పి మళ్ళీ అల్లుకోవాలి.

డిజైను, సందులు లేకుండా దగ్గర దగ్గరగా వేసుకోవడానికి ఈ సింగిల్ క్రోషియా అల్లిక ఉపయోగపడుతుంది.

టీచరు చెప్పినదంతా రాములమ్మ చాలా శ్రద్ధగా వినేది. తన నోటు పుస్తకంలో రాసుకునేది. టీచరు అల్లికలు వేసి చూపిస్తూ వుంటే ఆమె ఎంతో ఉత్సాహంగా నేర్చుకునేది.



వెంటనే తను మళ్ళీ ఆ అల్లికలు వేసి టీచరుకి చూపించేది.

రాములమ్మకి చెప్పినది తొందరగా అర్థం చేసుకోగల శక్తి ఉంది. పట్టుదలా, శ్రద్ధా ఉంది.

ఆ తరువాత టీచర్ 'డబుల్ క్రోషియా' అల్లిక నేర్పింది. డబుల్‌క్రోషియా ఎలా అల్లాలో వచ్చేవారం చూద్దాం.

కరెక్ట్ ఆన్సర్

తెలుగు క్లాసు జరుగుతోంది

"ఒరే శ్రీను మకరం అనే పదానికి అర్థం చెప్పరా" అడిగాడు టీచర్

"తెలియద్ సార్" చెప్పాడు శ్రీను

"పోనీ పసిడి అంటే ఏంటో చెప్పు" అడిగాడు టీచర్

"తెలియద్ సార్" అన్నాడు శ్రీను

"చివరగా ఒక ప్రశ్న అడుగుతాను. దీనికైనా సరైన సమాధానం చెప్పి తగలడు. తెలుసు అనే పదానికి వ్యతిరేక పదం చెప్పు" అనడిగాడు టీచర్

"తెలియద్ సార్" అన్నాడు శ్రీను యధావిధిగా

"శెభాష్ బాగా చెప్పావు కూర్చో అన్నాడు టీచర్.

పెండెం జగదీశ్వర్

సీరియల్

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

(7 వ భాగం)

గతవారం కథలో...

గాలవుడి వెంట రాకుమారి అడవుల్లో నానా బాధలనుభవిస్తూనే ప్రయాణించింది. ఎక్కడికి, ఎవరికి తనను ధారపోయడానికి తీసుకెళుతున్నాడో తెలియని మాధవి అసలు తాను రానని మొరాయిస్తే ఏం చేసేవాడని కూడా తలపోసింది. అవ్వ, చారునేత్రలను గుర్తుకుతెచ్చుకుని వగచింది కానీ ఏంచేస్తుంది. ఎంత ముక్కుమూసుకున్న ముని అయినా గాలవుడిలో ఉన్న మగాడు మాధవి అందానికి చలించిపోయాడు.

కొద్దిసేపటి క్రితం స్నానంచేసిన తాజాదనానికి తోడు చల్లగాలి వీచడంతో గాలవునికి ఎంతో హాయిగావుంది. చుట్టుపక్కలవున్న పూలచెట్లనుండి చక్కటి పరిమళాలను మోసుకొస్తోంది ఆ గాలి. పౌర్ణమిదినాలు కావడాన వెన్నెల కాస్తూ పగటిపూటలా భ్రమింపచేస్తోంది. ఆ వెన్నెల్లో మాధవి ముఖారవిందం స్పష్టంగా కనిపిస్తోంది. అందానికి ఆరోగ్యం తోడైన ఆమె దేహం సౌందర్యాన్ని రాశిపోసినట్లే వుంది. 'నారబట్టల్లో కూడా ఎంత అందంగా వుంది?! ఈమెని ఇంతవరకూ తాకకుండా ఎలా ఉండగలిగాను? యయాతి ఎవరైనా రాజుకు అర్పించి కన్యాశుల్కం తీసుకోమన్న మాట నిజమే. అలా చేస్తేనే గురుదక్షిణ ఇవ్వగల్గుతాడు. అయితేనేం, ఇవాళ మాధవితో గడిపితే ఎవరికి తెలుస్తుంది? ఒకవేళ ఎదురుతిరిగితే మాత్రం ఈ అడవిలో ఆమెని ఎవరు కాపాడగలరు? ఇంత సమీపంలో ఉన్నా దక్కించుకోలేదంటే అది తన చేతకానితనమే అవుతుంది' అనుకున్నాడు.

అప్పటివరకూ స్థిరంగా వున్న గాలవుడి చిత్తం ఇప్పుడు చలిస్తోంది. ఆమెని బలంగా హృదయానికి హత్తుకోవాలని రెండడుగులు ముందుకేశాడు. కానీ అంతలోనే శరీరం కంపించింది. అంత చల్లదనంలోనూ ముఖంనిండా చెమటలు పట్టుకొచ్చాయి. ఆలోచనలతన్ని చుట్టుముట్టాయి. 'ఛఛ.. ఇదేంటి తాను గాలవుడేనా? వేదమంత్రాలు అభ్యసించినవాడేనా? తానేంటి ఇంత హేయంగా ఆలోచిస్తున్నాడు? క్షణికసుఖంకోసం ధర్మపథాన్ని వీడాలనుకుంటున్నాడా? మాధవితో హద్దుమీరితే ఇతరులెవ్వరికీ తెలియకపోయినా తన మనస్సాక్షికి తెలియదా? తనను తాను తప్పించుకోగలడా? తాను చేసిన తప్పు తనను వెంటాడదా? ఊహూ.. తెలిసితెలిసి తనను తాను మురికికూపంలోకి నెట్టుకోలేడు. ఈ క్షణంనుండీ మాధవిపట్ల తనకెలాంటి వ్యామోహాలూ తలెత్తకూడదు. ఆమెని ఉపయోగించి గురుదక్షిణ నెరవేరేలా చూడాలే తప్ప మరేవో ప్రలోభాలకు పోయి తల వంచుకునే స్థితి తెచ్చుకోకూడదు' అనుకున్నాడు.

దాంతో మరుక్షణం వెనుతిరిగి వచ్చి అరుగుమీద కూర్చుని పద్మాసనం వేసుకుని ధ్యానం చేశాడు. కొద్దిసేపటికి గాలవుడి మనసు శాంతించడంతో వెళ్ళి మాధవికి దూరంగా పడుకున్నాడు.

ఎంత ఆలశ్యంగా పడుకున్నప్పటికీ యోగనిద్ర కావడాన అలసట లేకుండా తెల్లవారుఘామునే లేచాడు. ముఖప్రక్షాళనం పూర్తిచేసి ఒక గంటపాటు యోగాసనాలు వేశాడు. ఆనక స్నానం, సంధ్యావందనాలు కూడా ముగించి ముందురోజు సంపాదించిన కందమూలాలు సేవించి అరుగుమీద కూర్చున్నాడు.

అప్పటికి మాధవికి మెలకువ వచ్చి చుట్టూ కలయచూసి బయటకొచ్చింది.

"లేచావా? పనులన్నీ ముగించుకో. నీకు చన్నీళ్లు అలవాటు లేనట్లుంది ఇక్కడ మట్టిపాత్రలున్నాయి, వేడిచేస్తాను" అంటూ అప్పటికే సిద్ధంగా పెట్టిన ఎండుపుల్లలను పొయ్యి కిందుంచి చెకుముకిరాళ్ళతో నిప్పు రాజేశాడు.

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

మాధవి స్నానం పూర్తయ్యాక ఆమెక్కూడా కందమూలాలిచ్చి "మళ్ళీ మనం ప్రయాణించాలి మాధవీ, ఎండవేళకి చెట్లనీడన విశ్రమిద్దాం" అన్నాడు.

కొద్దిసేపట్లో ఇద్దరూ నడక సాగించారు. దొరికిన కాయలు, పండ్లు తింటూ, దప్పిక తీర్చుకుంటూ, కాసేపు అలుపు తీర్చుకుంటూ చాలా దూరవే నడిచి సాయంసంధ్యవేళకి ఒక ఆశ్రమం చేరారు. అది ఖాళీగా లేదు. అందులో రామానందుడనే ముని భార్యాసమేతంగా వుంటున్నారు.

గాలవుడు తాను విశ్వామిత్రుని శిష్యునని పరిచయం చేసుకోగానే రామానందుడు సాదరంగా ఆహ్వానించి మర్యాదలు చేశాడు. ఆయన గాలవునితో ముచ్చటిస్తోంటే, భార్య సూర్యకళ మాధవిని లోనికి తీసికెళ్ళింది.

గాలవుడు స్థూలంగా విషయం చెప్పి "ఇక్కడికి దగ్గర్లో ఏ రాజ్యముంది? ఆ రాజుగారి దానగుణం ఏపాటిది?" అనడిగాడు.

"అయోధ్య చాలా దగ్గర. సూర్యవంశపు రాజు హర్యశ్వుడు దానికి రాజు. ఆయనెంతో ఉదారుడు. నేను యజ్ఞయాగాదులు తలపెట్టినపుడు ఆయన్నే అర్థిస్తుంటాను"

"సంతోషం. అయోధ్యకు వెళ్ళే మార్గం కాస్త చెప్పండి"

"చాలా సులభం. ఇక్కడినుండి ఉత్తరదిక్కుగా రెండు యోజనాలు నడిస్తే ఒక ఎండిపోయిన ఉపనది వస్తుంది. దాన్ని కాలిబాటతోనే దాటవచ్చు. అక్కడినుండి ఈశాన్యదిక్కుగా ఆరు యోజనాలు నడిస్తే సరయూనది వస్తుంది. ఆ నదికి కుడివైపున అయోధ్య"

గాలవుడు సంతోషంగా తల పంకించాడు. వేగంగా నడిస్తే నాలుగురోజుల్లో అయోధ్య చేరుకోవచ్చు. హర్యశ్వుడు కనుక తన కోరికను తీర్చినట్లయితే తాను ఆందోళననుండి విముక్తుడు కావచ్చును అనుకున్నాడు.

"మరి స్నానంచేసి భోజనం చేద్దురుగాని లేవండి. అడవిలో రాత్రి ప్రయాణం ఎటూ మంచిది కాదు, ఉదయానే బయల్దేరవచ్చు" అన్నాడు రామానందుడు.

సూర్యకళ త్వరగానే భోజన ఏర్పాటు చేసింది. కొద్దిసేపటి పరిచయంతోనే ఎంతో ప్రేమగా కొసరికొసరి వడ్డించింది.

మాధవి, సూర్యకళ లోపలిగదిలో పడుకోగా... రామానందుడు, గాలవుడు ముందుగదిలో విశ్రమించారు.



రాను రాను నందుడికి లోపల రగిలిపోతోంది. 'నిష్కారణంగా ఒక రాజపుత్రిని ఇంత బాధపెడుతున్నాడే. ఇతడికీ హక్కు ఎవరిచ్చారు?' అనుకున్నాడు. గాలవుడు తన తప్పు తెలుసుకునేలా చేయాలని ప్రయత్నిస్తూ "మన లాంటి మునులు ముఖ్యంగా ఆచరించాల్సింది ఏమిటి గాలవా?" అనడిగాడు.

"ధ్యానంచేస్తూ ఇంద్రియనిగ్రహం పాటించాలి. భూతదయ ఉండాలి" అన్నాడు గాలవుడు.

లోపలిగదిలోకి ఆ మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"అమ్మా, గాలవునికి నిజంగా భూతదయే వుంటే నన్నిలా బలిపశువును చేసి తీసికెళ్ళేవాడా?" అంది మాధవి స్వరం తగ్గించి.

"మాధవీ, చాలామందికి చాలా తెలుసును కానీ వాటిని ఆచరించరమ్మా. విశ్వామిత్రులవారు పేరుకు బ్రహ్మర్షే కానీ, చేసిందేమిటి చెప్పు?! మేనక, ఘృతాచులతో కలిసుండలేదూ?"

"భూతదయకు సరైన నిర్వచనం ఏమిటంటారు? ఏ ప్రాణినీ చంపకూడదా?" రామానందుడు అడిగాడు.

లోపల సూర్యకళ 'చూశావా, ఆయన కావాలనే ఇలా అడుగుతున్నారు' అన్నట్లు తల పంకించి నవ్వింది.

గాలవుడు ఏం చెప్తాడో వినేందుకు మాధవి కూడా చెవులు రిక్కించింది.

గాలవుడు ఒక్క క్షణం తననెందుకిలా అడుగుతున్నాడని యోచించినా 'అయినా ఇందులో ఏముందిలే, విశ్వామిత్రులవారి శిష్యుడు కనుక తానేం చెప్తాడో పరీక్షించాలనుకుని ఉండవచ్చు' అనుకుని "కేవలం చంపకపోవడమే కాదుగా మునీంద్రా, ఏ జీవినీ ఏ రకంగానూ నొప్పించకూడదు" అన్నాడు.

"ఇష్టంలేని పని చేయించడమూ కూడా నొప్పించడం కిందికే వస్తుందా?"

"అందులో సందేహమేముంది మునివర్యా, అది కూడా జీవహింసే. అలా చేస్తే భూతదయ లేనట్లే" అన్నాడు. కనీసం అప్పుడన్నా మాధవిని కష్టపెడుతున్నాననే స్పృహే అతనిలో లేదు.

మాధవితోబాటు సూర్యకళ కూడా ఉసూరుమంటూ నిట్టూర్చింది.

'ఈ మూఢుడికి జ్ఞాపకశక్తి ఉంది కానీ గ్రాహణశక్తి శూన్యం. తనంతట తాను పశ్చాత్తాపంచెంది మారతాడేమోనని ఆశించాడు కానీ అది సాధ్యంకాదనిపిస్తోంది. తాను కనుక నీతులు వల్లిస్తే విశ్వామిత్రుడికి చెప్పి శపించేలా చేసినా చేస్తాడు' అనుకుని "సంతోషం, చాలా అలసిపోయినట్లున్నారు, ఇక పడుకోండి" అన్నాడు రామానందుడు.

మాధవి మౌనంగా కళ్ళు మూసుకోగా చెంపలవెంట కన్నీరు కారింది.

సూర్యకళ కన్నీరు తుడిచి, చేతిస్పర్శతోనే ఓదార్చి పడుకుంది.

మాధవికి ఎంతకూ నిద్రపట్టలేదు.

'అయితే అయోధ్యరాజు హర్యశ్వుడికి తనను అర్పించబోతున్నాడన్నమాట. అతడు ఎలాంటివాడో?! కోపిష్టి కాదు కదా. ఏమైతే మాత్రం తానేం చేయగలదు? ఇదేం స్వయంవరమా? తన ఇష్టాయిష్టాలతో ప్రమేయమే లేదు. తానొక అమ్మకపు వస్తువు. తన అభిప్రాయానికి విలువిచ్చే ప్రసక్తేలేదు' అనుకునేసరికి బాధ తన్నుకొచ్చింది. ఆ దుఃఖంతోనే కళ్ళు మూసుకుంది.

ఇంకా వుంది.

అయోధ్య రాజు హర్యశ్వుడు గాలవుడి అవసరాన్ని తీర్చాడా?

అందుకు ప్రతిగా మాధవిని ఎలా మారకం వేశారు? మాధవి పట్ల హర్యశ్వుడు ఎలా స్పందించాడు?

అయోధ్య రాజ్యంలో మాధవికి ఎలాంటి ఆశ్రయం దొరికింది?

రాబోయే సంచికలో...

క్యాంపస్ ఛాట్

కె శివలీల

"అపరిచితుడులా మారిపోయి. ఆలస్యానికి కారణమైన వారిని శిక్షించాలనిపిస్తుంది" అని కొందరు సమాధానమిస్తే....మరికొందరు శిక్షించడం వారిలో మార్పు తీసుకురాగలమా? అంటూ దీన్ని వ్యతిరేకించారు. ఇదీ క్యాంపస్‌లలో సాగుతున్న నేటి సంభాషణ".

'అపరిచితుడు' స్టైయిల్లో

అది యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ బస్టాపు. దాదాపు పదిహేను మంది అమ్మాయిలు బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. వారిలో రమ్య ఒకటి. కాసేపు గడిచిన తరువాత... రెండు బస్సులు ఒకదానివెంట మరోటి వస్తున్నాయి. వాటిలో ఒకటి వారిని దాటి, అల్లంత దూరంలో ఆగింది. కొద్దిమంది అమ్మాయిలు దాన్ని అందుకున్నారు. మరికొందరు అందుకోలేక పోయారు. మరోటి వారికి ఆమడదూరంలో ఆగినట్లు ఆగి, చటుక్కున స్పీడందుకుంది. ఏదేమైనా రమ్య సహా ఇద్దరమ్మాయిలు ఈ రెండు బస్సుల్లో ఏ ఒక్కదాన్నీ అందుకోలేకపోయారు.

అది లేడీస్ హాస్టల్... సమయం 8 గంటలు. లత హడావిడిగా స్నానానికెళ్లడానికి సిద్ధమౌతోంది. ఇంతలో...రూమ్మేట్ వనజ నిద్రలేచింది. "లతా... ప్లీజ్... నాకు లేటయిపోతోందే...ఐదు నిముషాల్లో వచ్చేస్తాను. నీకెలాగూ క్లాసు తొమ్మిదిగంటలకి కదే" అని బతిమాలుతోంది. చేసేదేం లేక సరే అంది లత. ఐదు...పది...పదిహేను... ఇలా నిముషాలు గడిచిపోతున్నాయి. లతలో అసహనం పెరిగిపోతోంది. వనజ ఇప్పట్లో బాత్‌రూం నుంచి బయటికొచ్చే జాడే కనబడట్లేదు.

కేవలం ఇటువంటి విషయాల్లోనే కాదు....మాకిబ్బంది కలిగించే ఏ సందర్భంలోనైనా మేం "అపరిచితుడులా



మారిపోయి. ఆలస్యానికి కారణమైన వారిని శిక్షించాలనిపిస్తుంది'' అని కొందరు సమాధానమిస్తే....మరికొందరు శిక్షించడం వారిలో మార్పు తీసుకురాగలమా? అంటూ దీన్ని వ్యతిరేకించారు.

"ఆ రోజు మా హాస్టలంతా నిశ్శబ్ధంగా ఉంది. కారణమేంటా అని ఆరాతీస్తే టీవీ చెడిపోయిందట. మంచిపనైంది అనుకుని తేలిగ్గా ఊపిరిపీల్చుకున్నా. హాయిగా రూంలో కూర్చుని చదువుకుంటున్నా. ఇంతలో 'టీవీ ఇక్కడ పెడితే పనిచేస్తుందేమో చూస్తానంటూ' సుడిగాలిలా మా గదిలోకి దూసుకొచ్చిందో అమ్మాయి. నేను సమాధాన మిచ్చేంతలో... 'ఓ రెండు గంటలు చదువుమానేస్తే ఏం కాదులే' అని తేల్చిచెప్పేసింది. క్షణాల్లో వేరే అమ్మాయి సహాయంతో టీవీ తెచ్చి మా రూంలో పెట్టేసింది. ఒక గంట గడిచింది. టీవీ ఆఫ్ చేసే సూచనలే లేవు. గత్యంతరం లేక చదువుకోవడానికి బయటికొచ్చా. దోమలు ఆ పనీ సాగనివ్వలేదు. తన ఆనందంకోసం నా చదువును పాడు చేసిన ఆ అమ్మాయిపై కోపం, అసహ్యం రెండూ ఒకేసారి కలిగాయి. ఒక్కసారి అపరిచితుడులా మారి ఆ అమ్మాయికి బుద్ధిచెప్తే ఎంతబాగుంటుందో అనిపించింది. కానీ నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది" అని కావ్య చెప్పారు.

"నేను ఓ రోజు కోఠి సెంటర్‌లో నిలుచుని మా ఫ్రెండ్ కోసం ఎదురుచూస్తున్నా. కొంచెం దూరంలో ఓ బైక్ ఆగింది. వెనుక కూర్చున్న ఆవిడ తనతో పాటు తెచ్చిన ఇద్దరు పిల్లల్ని రోడ్డు పక్కనే దించింది. ఆవిడేం చేయబోతోందా అని ఆశ్చర్యంగా చూస్తున్నాను. వెంటనే ఆమె బైక్ మీద కూర్చుంది. అతను బైక్ స్టార్ట్ చేశాడు. రెప్పపాటులో వారు మాయమయ్యారు. ఆ పిల్లలిద్దరూ 'మమ్మీ...' అంటూ గుక్కపట్టి ఏడుస్తున్నారు. నాకేం చేయాలో పాలుపోలేదు. వాళ్లు మళ్లీ వస్తారేమో అనుకున్నాను. అరగంట గడిచిపోయింది. వారు హృదయ విదారకంగా ఏడుస్తూనే ఉన్నారు. ఈ సంఘటన ఇప్పటికీ నా కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. పిల్లల్ని అలా వదిలేసి వెళ్లే వాళ్లపైన చాలా కోపంవస్తుంది. కొందరు మనుషులు ఎందుకిలా ప్రవర్తిస్తారో.... ఏం చేస్తే వీళ్లలో మార్పుతీసుకురాగలమో అనిపిస్తుంది. ఒక వేళ అపరిచితుడులా మారితే... వారిరువుర్నీ శిక్షించగలం. కానీ నిజమైన మార్పు తీసుకురాగలమా?" అని అరుణ ప్రశ్నించింది.

నిజమే కదా ఫ్రెండ్స్! కేవలం శిక్షించడం వల్లే సమాజాన్ని మార్చగలమా? మనిషుల్లోని మంచితనాన్ని, మానవత్వాన్ని బయటికి తీసుకురాగలమా? మీరూ ఆలోచించండి.



పిలవని పేరంటం

పిలవకుండా పెళ్ళి విందుకొచ్చిన యాదగిరిని గుర్తుపట్టి బయటికి గెంటేశారు. పెళ్ళివారు. యాదగిరి వెళ్ళిపోకుండా గేటు దగ్గరే నిలబడ్డాడు.

"ఇంకా వెళ్ళకుండా ఇక్కడే ఉన్నావేం?" అనడిగాడు ఓ పెద్దమనిషి

"లోపల నాభార్యా, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వాళ్ళొచ్చాక వెళ్తాలే" తాపీగా జవాబిచ్చాడు యాదగిరి.

పెండెం జగదీశ్వర్

సినిమా కబుర్లు

చందు

'దసరాబుల్లోడు'తో దర్శకునిగా పరిచయమై శతదినోత్సవ, రజతోత్సవ చిత్రాలను అందించిన దర్శక, నిర్మాత వి.బి. రాజేంద్రప్రసాద్. ఒక దర్శక, నిర్మాతకి ఉండాల్సిన లక్షణాలు పుష్కలంగా మూర్తీభవించిన వ్యక్తి కనుకనే ఆయన తన కెరీర్‌లో విజయాలనే ఎక్కువగా చవిచూశారు.ఆయన ఈ వారం మన స్నేహ పాఠకులకు సినిమాకబుర్లు చెబుతున్నారు.

"మా వాడికి అపకారమే చేశాను"



ఈనాటి చిత్ర నిర్మాణం చూస్తుంటే ఎందుకింత ఆర్భాటం చేస్తారనిపిస్తుంది. భారీ పెట్టుబడి, భారీ ఏర్పాట్లు, మిరుమిట్లతో సాగుతోంది మరి! ఎవరో అంత ఖర్చు చేశారు...ఇంత ఖర్చు చేశారని మనమూ అంత ఖర్చు చేయకపోతే ఎలాగా...మనం వెనుకబడిపోతామని అనుకుంటున్నారు. మన సినిమా సోదిలోకి కూడా రాదేమోనని అంటుంటారు. ఇక ఆ ఆలోచన వచ్చాక ఆర్భాటాలు, మిరుమిట్లు తప్ప వేరే ఏమీ ఆ సినిమాలో ఉండటంలేదు. ఈ విషయం విబి రాజేంద్రప్రసాద్‌గారితో ఎవరైనా అన్నారనుకోండి...ఆయన ఇలా అంటారు.

అరవైమంది డ్యాన్సర్ల మధ్య హీరోహీరోయిన్లు ఎక్కడో...

ప్రపంచమార్కెట్టును బట్టి బాలీవుడ్ చిత్రాల బడ్జెట్ భారీగా ఉంటుంది. దీనికి పోటీగా టాలీవుడ్ చిత్రాల ఖర్చు ఉంటోంది. అవసరమున్నా, లేకపోయినా లోకేషన్‌లో నూతన టెక్నాలజీ అందుబాటులో ఉండాలి. ఒక్కొక్క డైరెక్టర్ చేతి కింద పదిమంది అసిస్టెంట్లు. అంతమంది అవసరమా? ఫారిన్‌లో చిత్రాన్ని చిత్రీకరించడం స్టేటస్ సింబల్‌గా మారింది. నా మొట్టమొదటి సినిమా 'దసరా బుల్లోడు'లో 'నల్లవాడే... అమ్మమ్మో అల్లరి పిల్లవాడే' అనే పల్లవితో సాగే పాటలో ఆరుగురు గ్రూపు డాన్సర్లు మాత్రమే కనబడతారు. నేడది 60కి చేరింది. అంతమందిలో హీరోహీరోయిన్లు ఎవరో తెలుసుకోవాలంటే ఓ పది షాట్స్ వరకూ వేచి చూడాల్సిన చందంగా మారింది.

అలాగే ఆరోజుల్లో షూటింగ్ తీసే విషయంలో ఎంతో క్రమశిక్షణ పాటించేవారు. టైమ్ అంటే టైమ్‌కే షూటింగ్ ప్రారంభమయ్యేది. డైరెక్టర్ చెప్పిన టైంకి ఎంత అగ్రహీరో అయినా ముందే వచ్చేసేవారు. ఎదురుచూడ్డం అనే సమస్య ఉండేది కాదు. ఏ ఆర్టిస్టు ఎన్నింటికి రావాలో పక్కాగా ఉండేది. ఉదయం ఏడింటికల్లా షాట్ రెడీ అయ్యేది. ఇప్పుడు పదింటికి తీస్తే గొప్పే. ఇప్పుడు ఆర్టిస్టులందరూ సెట్‌లో ఉండాల్సిందే. షాట్ ఎవరి మీద ఎప్పుడు తీస్తారో వాళ్ళకే తెలియడం లేదు.



నిర్మాతగా ఇప్పటి వరకూ మూడు భాషల్లో కలిపి 34 చిత్రాలు నిర్మించాను. అందులో పద్దెనిమిది చిత్రాలకు నేనే దర్శకుణ్ణి. వీటిలో నాలుగైదు సరిగా పోలేదు. మిగిలినవన్నీ సక్సెస్ అయ్యాయి. అంతకంటే మించిన సంతోషం ఏముంది?! కానీ ఒకటే ఒకింత విచారించే అంశం ఉంది.

మా వాడికి అపకారమే చేశాను

మా అబ్బాయి జగపతి బాబును 'సింహస్వప్నం'తో సినీ రంగ ప్రవేశం చేయించాను. కానీ అది ఎక్కువరోజులు ఆడలేదు. అంటే హిట్ అవ్వలేదు. అలా నేను మా వాణ్ని ఒక ఫ్లాప్ హీరోగా సినిమా పరిశ్రమకు పరిచయం చేశానా అనిపించింది. కానీ మా జగపతిబాబు వాడి కాళ్ళమీద వాడు నిలబడి ఒక ఫ్యామిలీ హీరోగా, మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. నేను వాడికి అపకారమే చేశాను తప్ప ఉపకారం చేయలేదు. ఇక వాడి సినిమా జీవితంలో నేనసలు జోక్యం చేసుకోకూడదని పించింది. రోజులతో పాటే కథలూ మారుతున్నాయి. తప్పులేదు. 'ఆరాధన' చిత్రంలో నాగేశ్వరరావు గుడ్డివాడుగా నటించాడు. నేటి హీరోలు అలా నటించడానికి అంగీకరిస్తారా! ఇది ఒక జీవిత చక్రం. ఎక్కడ మొదలైందో చివరికి అక్కడికి చేరాల్సిందే.

మరిన్ని కబుర్లు వచ్చే సంచికలో...

✤



పదమూడు కోతులేవి?

హేయ్! పిడుగులూ... ఆదివారం కదా. మీకు కాస్త పని పెడదామనిపించింది. అందుకే ఒక బొమ్మ తెచ్చాం. అందులో కొన్ని కోతులున్నాయి. ఎన్నంటే...సరిగ్గా పదమూడు. అవి ఎక్కడెక్కడ వున్నాయో? ఏం చేస్తున్నాయో కనిపెట్టాల్సింది మాత్రం మీరే! మరి రెడీనా! వెంటనే పెన్నో, పెన్సిలో తీసుకుని సున్నా చుట్టి వాటిని గుర్తించండే.

గడులు నింపండి

			=30
			=19
			=30
= 30	= 19	= 30	= 19

చిన్నారులూ...పైన 9 గడులున్నాయికదా. వాటిని నింపితే ఎదురుగానున్న అంకె రావాలి. సమాధానం కావాలంటే... పైవారం వరకు వేచివుండాల్సిందే.



మీరూ బొమ్మలు వేస్తారా!

నేస్తాలూ! పక్కన కొందరు మిత్రులు వేసిన బొమ్మలు చూశారుగా. ఎంత బావున్నాయో కదూ. మీరు కూడా చక్కటి బొమ్మలు పంపితే ప్రచురిస్తాం. మా చిరునామా: చిన్నారి చిత్రకారులు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

చిన్నారి చిత్రకారులు



ఎన్.సాయిచరణ్,
4వ తరగతి,
జ్ఞానోదయ హైస్కూల్,
మదనపల్లి, చిత్తూరు.

సంక్రాంతి నిఖిత,
7వ తరగతి,
ఠాగూర్ విద్యాలయం,
లాలాపురం, ఖమ్మం.

తీరిగ్గా ముచ్చట్లు చెప్తోందెవరబ్బా!



బుజ్జాయిలూ! పక్క బొమ్మను ఎవరు వేశారనుకున్నారు. ఓ ఆర్టిస్టు అంకుల్. దాన్ని మీకు ఎందుకు పంపించారనుకుంటున్నారు! ఎందుకంటే... అక్కడ చలాకీగా చిక్కకుండా, దొరక్కుండా ఈదే చేపలతో ఎవరో కబుర్లు చెప్తున్నారు. వారెవరో మీరు కనిపెట్టగలరో లేదో తెలుసుకోవాలనుకుంటున్నాడు ఆ అంకుల్. అందుకన్నమాట. కబుర్లుచెప్పేవారెవరో తెలియాలంటే మీరు ఎంచక్కా 1 నుంచి 60 వరకు అంకెలు కలిపెయ్యండే.

పిల్ల చేపలెన్ని?

నేస్తాలూ! కింద ఒక చక్కటి బొమ్మ వుందికదా. దాన్ని కేవలం మీకోసమే ఓ మిత్రుడు పంపాడు. ఇంకా అతను ఏం చెప్పాడంటే... అనగనగా ఒక చెరువు వుంది. అందులో ఒక మూలన ఓ చేప నివాసం ఏర్పాటుచేసుకుంది. దానికి ఈ మధ్యే కొన్ని పిల్లలు పుట్టాయి. ఇదిగో ఎంచక్కా బొమ్మలో దాక్కున్నాయికూడా. పిల్లచేపలు ఎన్నో చెప్పకోండి చూద్దాం. ఏం లేదర్రా! పెన్సిల్ తీసుకుని ఒక్కో చేపపిల్ల దగ్గర నెంబర్ వేయండి. తెలిసిపోతుంది.

కలివీరి గుమ్మడిపండు వీరి పేరేమి?



హాలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో తెలుసా! అవునర్రా! ఈయనను చూడగానే మనకు ఓ పాట గుర్తొస్తుంది. మరి ఆయనెవరో కార్డు మీద చకచకా రాసేసి పోస్ట్ చెయ్యండే.

మా చిరునామా: వీరి వీరి గుమ్మడి పండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

7.8.05 కు సరైన సమాధానం రాసినవారు

తాంద్ర వేణుగోపాల్ పృథ్వి, 9వ తరగతి, సామర్లకోట, తూ.గో. దంగేటి గేయశ్రీ దేవి, 2వ తరగతి, ఎమ్‌పిపి పాఠశాల, అయినాపురం బాదవ, తూ.గో. కె.లత, 6వ తరగతి, మధు విద్యాలయం, వైరా, ఖమ్మం. దుస్సా అక్షయ్ కుమార్, 5వ తరగతి, జనగామ. మహ్మద్ రాజ్‌మహ్మద్, 5వ తరగతి, బాల కార్మిక పాఠశాల, వీవర్స్ కాలనీ, దేశాయిపేట. బి.లలిత, 8వ తరగతి, బి. చక్రవర్తి, 5వ తరగతి, ఠాగూర్ విద్యాలయం, వైరా, ఖమ్మం. రాళ్లబండి సౌందర్య, శ్రీరాంపూర్ కాలనీ. ఎండి అయేషాబాను, 1వ తరగతి, వికాస్ పబ్లిక్ స్కూల్, కందుకూరు. పి.గోపీకృష్ణ, 4వ తరగతి, వినుకొండ, గుంటూరు. యర్రా వెంకట సురేంద్ర, 3వ తరగతి, అరుణా విద్యానికేతన్, కట్టవారి పాలెం, గుంటూరుజిల్లా. యన్.రుచికరెడ్డి, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి. జె.కనకలక్ష్మి, పెళ్లకూరు, నెల్లూరు. కె.సుమంత్‌సాయి, 10వ తరగతి, నాయుడుపేట, నెల్లూరు. దేవరపల్లి శివయ్య, 7 వ తరగతి, చిల్కాబత్తిని యల్లమంద, 6వ తరగతి, ఎస్‌సి.హాస్టల్, త్రిపురాంతకం. బేతం శివ, 6వ తరగతి, ఎ.అనిల్, 7వ తరగతి, శ్రీ చక్రధర పబ్లిక్ స్కూల్, సోంపేట, శ్రీకాకుళం.

14.8.05 సమాధానం:
ఝాన్సీ లక్ష్మీబాయి

అట్టమీది కథ

కొండూరు వీరయ్య

విలక్షణ దేశాధినేత మన్‌మోహన్‌సింగ్

ఆయన వృత్తి, ప్రవృత్తి రెండూ ఆర్థికమే. అలాంటి వ్యక్తి దేశప్రధాని కావడమొక విలక్షణం. విభజన అనంతరం పాకిస్తాన్‌గా ఏర్పడిన గడ్డపై జన్మించిన వ్యక్తి భారత దేశాధినేత అవ్వడం-భారతదేశంలో జన్మించిన వ్యక్తి పాకిస్తాన్ దేశాధినేత అవ్వడం మరో విలక్షణం. ఒక పండ్ల వ్యాపారి కొడుకుగా పుట్టిన మన్‌మోహన్‌సింగ్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆర్థికవేత్తగా రూపొందారు. ఒక గ్రామ సామాన్యుడు అసామాన్యుడై దేశప్రధానిగా ఎదిగారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాజధాని గడ్డపై అతిథి అయ్యారు. ఒక అపురూప సందర్భమయిన ప్రజాశక్తి ఇరవైదేళ్ల ఉత్సవ వేడుకల్లో మన మధ్య ఉన్నారు. ఒక తెలుగు పత్రిక, ఒక ప్రాంతీయభాషా పత్రిక రజతోత్సవ వేడుకకు దేశప్రధాని ముఖ్య అతిథిగా రావడం అరుదైన సందర్భం.

వృత్తిరీత్యా ఆర్థికవేత్త అయిన మన ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ క్రమంగా సంపూర్ణ రాజకీయవేత్తగా పరిణామం చెందుతున్నారు. దీనికి సంబంధించిన సూచనలు గత సంవత్సరంన్నర కాలంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఉద్దండుల జాబితాలో ఎక్కడా కనిపించని మన్మోహన్‌సింగ్ అకస్మాత్తుగా ప్రధాని పదవి చేపట్టటమే పెద్ద విశేషం. గత సంవత్సరం నాటకీయ పరిణామాల అనంతరం ప్రధాని పదవికి తన పేరు ప్రతిపాదించిన సోనియాకు స్వయంగా కృతజ్ఞతలు తెలుపుతూ మన్మోహన్‌సింగ్ "మీరు నామీద ఉంచిన విశ్వాసాన్ని నిలుపుకునేందుకు చేయగలిగిందంతా చేస్తాను" అన్నారు. కాంగ్రెస్ సంస్కృతి తెలిసినవారికి ఇది వ్యక్తి ఆరాధనగా కనిపించవచ్చు కానీ మరింత లోతుగా గమనిస్తే గానీ ఇందులో సారం బోధపడదు. పాలనా బాధ్యతలు చేపట్టిన మొదట్లో తరచు ఆయనే జనపథ్ 10కి వెళ్లి సోనియాగాంధీతో చర్చించి వస్తుండేవారు. కానీ క్రమంగా ఇప్పుడు సోనియాగాంధీయే ప్రధాని నివాసం రేస్‌కోర్స్ రోడ్ 7కు వెళ్లి ప్రధానితో చర్చించి వస్తున్నారు. సోనియా వ్యవహారశైలి కూడా ఇందునకు ఒక కారణం. ఏమైనా గత సంవత్సరంన్నర పరిణామాలు గమనిస్తే ప్రధాని మన్మోహన్ పరిణతి చెందిన రాజకీయవేత్తగా మారే దిశగా పయనిస్తున్నారని చెప్పవచ్చు.

అమృతసర్ నుండి అస్సాంకు వయా ఆక్స్‌ఫర్డ్

ప్రధాని మన్మోహన్‌సింగ్ అస్సాం నుండి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1991లో రాజ్యసభలో ప్రవేశించింది మొదలు ఆయన కొంతకాలం ప్రతిపక్ష నేతగా ఉన్నారు. అంతేతప్ప పెద్దగా రాజకీయ చిత్రంలో కనిపించని తాజారాజకీయవాది. ఆయన జన్మస్థలం ప్రస్తుతం పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో గల గాహ్ గ్రామం. ఇప్పటి పాకిస్తాన్ అధ్యక్షులు పర్వేజ్ ముషరఫ్ ఢిల్లీలో పుట్టి పాకిస్తాన్‌ను పాలిస్తుంటే మన్మోహన్ ఇప్పటి పాకిస్తాన్ భూభాగంలో పుట్టి భారతదేశాన్ని పాలించటం కాకతాళీయమే. అయినా ముఖ్యమైన చారిత్రక సన్నివేశం అని చెప్పకతప్పదు. మన్మోహన్‌సింగ్‌కు 14 ఏళ్ల వయసులో దేశ విభజన నేపథ్యంలో కుటుంబం అమృతసర్‌కు వలస వచ్చింది. తండ్రి డ్రైఫ్రూట్స్ అమ్మే వ్యాపారి. ఆయన తన ఇంటర్వ్యూకు వెళ్లటానికే మొదటిసారి సూటు వేసుకున్నారు. అంత సాధారణ కుటుంబం నుండి వచ్చిన ప్రధానమంత్రి తన గతాన్ని మర్చిపోలేదు. ప్రధాని అయిన తర్వాత తన మొదటి అమెరికా యాత్ర లో ప్రభుత్వం ఇచ్చిన స్కాలర్‌షిప్‌ల ద్వారానే చదువుకుని ఇంతటి వాడినయ్యానని సవినయంగా చెప్పుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ పట్టా పుచ్చుకుని వచ్చిన ఆయన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో అధ్యాపకునిగా జీవితం ప్రారంభించారు. అక్కడ నుండే ఆయన సివిల్ సర్వీసుకు ఎంపికయ్యారు. 1971లో ఆయన ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా చేరారు. తర్వాత ఆయన ఆర్థిక శాఖ కార్యదర్శిగా, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షునిగా పనిచేశారు. ఆయన పివి నర్సింహారావు కోరిక మేరకు 1991లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మన్మోహన్ రాజకీయ జీవితం అక్కడ నుండే ప్రారంభమైందని చెప్పవచ్చు.

ఆర్థిక వేత్త నుండి రాజకీయ వేత్తగా...

1991 - 1996 మధ్య నికరమైన సరళీకరణ వాదిగా వ్యవహరించిన నాటి ప్రధాని తర్వాత కాలంలో ఆ విధానాల గురించి ఆత్మ విమర్శ ప్రారంభమైందని చెప్పవచ్చు. 2002లో రాజ్యసభలో ఒకసారి మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ తాను ప్రారంభించిన సంస్కరణలకు, ఎన్డీయే అమలు చేస్తున్న సంస్కరణలకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని చెప్పటమే కాక సంస్కరణలు నిరుద్యోగాన్ని, ఇతర ఆర్థిక సమస్యలను కూడా పెంచుతున్నాయని అంగీకరించారు. అనంతరం 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక విడుదల చేస్తూ సరళీకరణ గురించి తన అవగాహనను స్పష్టీకరించారు. మానవతాకోణం లేని విధానాలు ప్రజల మన్నన పొందలేవని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ప్రధానిగా పగ్గాలు చేపట్టిన తర్వాత కొంత మార్పు కన్పిస్తుంది. కానీ పెట్టుబడుల ఉపసంహరణ విషయం మొదలు సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు వరకు యుపిఎ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల్లో సంస్కరణల పట్ల ప్రధానికున్న అప్రమత్తత కూడా కనిపిస్తోంది. 1991లో అప్పటి ప్రధాని ఆయన్ను ఆర్థిక మంత్రిగా ఆహ్వానించినందుకే మన్మోహన్ ఆశ్చర్యపోయారు. 2004లో సోనియా ప్రధానిగా ఆహ్వానించేసరికి కాదనలేని పరిస్థితి ఎదురైంది. గతంలో రాజ్యసభలో పార్టీ నేతగా ఉన్నా, ఇప్పుడు ప్రధానిగా ఉన్నా భుజకీర్తులు తగిలించుకుని తిరగాలన్న ధోరణి ఎక్కడా కనిపించదు. రాజకీయ నేతగా ఆయనలో వచ్చిన పరిణతికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన చేసిన ప్రసంగాలు దర్పణం పడతాయి. మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసాలను ప్రజలతో జరిపే సంభాషణలుగా మార్చే శక్తి సామర్థ్యాలున్న వక్త. అయితే ఇప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నెహ్రూ వంటి వక్త కాదు. ఆయనకున్నంత పాండిత్యం ఈయనకు లేదు. అనుభవం నేర్పిన పాఠాలు మాత్రం ఎన్నో ఉన్నాయి. దీనికనుగుణంగానే ఆయన ఎర్రకోట బురుజులపై నుండి చేసే ప్రసంగాలను ఏటా కొత్త పథకాలు ప్రారంభించే అవకాశంగా కంటే, ఇచ్చిన హామీలపై ప్రోగ్రెస్ రిపోర్టును దేశప్రజల ముందుంచే సందర్భంగా మార్చుకున్నారు. సౌత్ సౌత్ కమిషన్ సెక్రటరి జనరల్‌గా పని చేసిన సమయంలో ఆయన ముంబయిలో జరిగిన కమిషన్ సమావేశంలో వెల్లడించిన అభిప్రాయాలు, ప్రపంచీకరణ గురించి, సామ్రాజ్యవాద దేశాల వ్యవహార శైలి గురించి, బహుళజాతి కంపెనీల గురించి ఆయన చెప్పిన విషయాలను అధ్యయనం చేయటం ఉపయోగకారిగా ఉంటుంది.


కుటుంబ సభ్యులతో

రబ్బరు స్టాంపు కాదు

భారతదేశ ప్రధానుల్లో రాజకీయాల్లో హేమా హేమీలని చెప్పదగిన వారు కూడా పరిపాలన విషయంలో జీరోలుగా ఉన్న విషయం మనకు కనిపిస్తూనే ఉంది. దాదాపు 20 సంవత్సరాల పాటు ప్రభుత్వంలో వివిధ కీలక హోదాల్లో సివిల్ సర్వెంట్‌గా పని చేసిన మన్మోహన్‌సింగ్ విషయంలో ఇది వాస్తవం కాదని చెప్పవచ్చు. వివిధ సమస్యలను ఆయన పరిష్కరించిన తీరు ప్రధానికి ఉన్న పాలనా దక్షతను ప్రస్ఫుటింప చేస్తోంది. చాలా కాలం తర్వాత కాంగ్రెస్‌లో పార్టీ, ప్రభుత్వం వేర్వేరు అన్న అభిప్రాయం కలిగించే పరిస్థితులు ఇప్పుడు తలెత్తాయి. పార్టీకి రాజకీయ బాస్ సోనియా అయితే ప్రభుత్వానికి పాలనపరమైన బాస్ మన్మోహన్ అని ఈ కాలంలో రుజువు చేసుకున్నారు. ప్రధానిగా మన్మోహన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వచ్చిన విమర్శల్లో ముఖ్యమైనది ఆయన సోనియా చేతిలో రబ్బరు స్టాంపు అని, విధాన నిర్ణయాలన్నీ సోనియాయే తీసుకుంటారన్న విమర్శ. ఈ సంవత్సరంన్నర కాలంలో ఈ విమర్శ తప్పు అని ఆయన ప్రవర్తన రుజువు చేస్తోంది. సంకీర్ణ ధర్మాన్ని అనుసరించి మంత్రివర్గం పొందికను నిర్ణయించటంలో పార్టీ అధిష్టానం ముఖ్య పాత్ర పోషించినా రోజు వారి పాలనా వ్యవహారాలకు పార్టీని దూరంగా ఉంచటం ద్వారా సోనియాగాంధీ మెరుగైన నిర్ణయం తీసుకున్నారు. సిఎంపి హామీలకు సంబంధించిన విషయాలు మినహా మిగిలిన పాలనా వ్యవహారాల్లో ఆమె జోక్యం చేసుకోవటం లేదు. ఆ విధంగా ప్రతిపక్ష విమర్శలను వమ్ము చేయటంలో ఇరువురు విజయం సాధించారు. మొదట్లో సోనియా సూపర్ ప్రధాని అని విమర్శించిన బిజెపి వాదన నేడు వీగిపోవటం కంటే ఇందుకు మెరుగైన ఉదాహరణ ఉండబోదు. ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలపై దృష్టి సారించటంలో గానీ జార్ఖండ్ వ్యవహారంలో ముఖ్యమంత్రిగా సోరెన్ రాజీనామా చేయాలని ఆదేశించటం గానీ, ఆయన తన నిర్ణయాలపై పార్టీ ప్రభావం లేదని నిరూపించారు. బీహార్‌లో లాలు దూకుడును నిలువరించటంలో కూడా ప్రధాని వ్యక్తిగతంగా శ్రద్ధ పెట్టారు.


బుష్ దంపతులతో


ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడితో...

డా॥మన్‌మోహన్ జీవన రేఖలు

తల్లీదండ్రులు : శ్రీమతి అమ్రిత్ కౌర్, శ్రీ గురుముఖ్ సింగ్
పుట్టినతేదీ : సెప్టెంబర్ 26, 1932
జన్మస్థలం : గాహ్(ఉత్తర పంజాబ్)
చదువుసంధ్యలు : పంజాబ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల్లో సాగిన చదువుల్లో సాధించిన డిగ్రీలు- ఎం.ఏ., డి.ఫిల్.(ఆక్స్‌ఫర్డ్)., డి.లిట్(హానారిస్ కాసా)
వివాహం-కుటుంబం : సెప్టెంబర్ 14,1958లో గురుశరణ్ కౌర్‌ను తన శ్రీమతిగా చేసుకున్నారు. ముగ్గురు ఆడపిల్లల సంతానం.

చేసిన ఉద్యోగం : ప్రొఫెసర్ మరియు సివిల్ సర్వెంట్.
చేపట్టిన పదవులు- సాధించిన స్థానాలు : 1971-72 విదేశీవాణిజ్య వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా విదేశీ వాణిజ్య మంత్రిత్వ శాఖలో చేయడంతో మొదలయ్యారు. 1991లో రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనేక జాతీయ అంతర్జాతీయ విద్యాసంస్థలకు, సంఘాలకు అనేక గౌరవప్రదమైన బాధ్యతలు నిర్వహించారు. పుస్తకాలు ప్రచురించడమే కాక అనేక అవార్డులకు అర్హులయ్యారు. పివి నరసింహారావు త్రప్రభుత్వంలో ఆర్థికశాఖామాత్యులుగా, నేడు దేశప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

దళపతి... ఈ దేశాధిపతి!

పాలనలో ఎంత అనుభవం ఉన్నా ఏ ప్రభుత్వాధినేతకైనా తన మంత్రివర్గ సహచరుల మధ్య సమన్వయం సాధించలేకపోతే సదరు అధినేత ఇబ్బందులు పడక తప్పదు. ఈ ఇబ్బందులు సమన్వయ లోపంతో వచ్చేవి కొన్నైతే ఒంటెత్తు పోకడలతో వచ్చేవి మరికొన్ని ఉంటాయి. మన్మోహన్ నేతృత్వంలో మొదటి ఆర్నెల్లలో అటువంటి ధోరణులు చోటు చేసుకున్నా త్వరగా మేలుకొని వాటిని సరిదిద్దటంలో ప్రధాని జాగ్రత్తపడ్డారని చెప్పవచ్చు. బీహార్‌లో ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత యుపిఏ భాగస్వాములైన ఆర్జేడీ, లోక్‌జనశక్తి పార్టీల మధ్య, జార్ఖండ్‌లో కాంగ్రెస్, జెఎంఎం మధ్య సంబంధాలు విషమ స్థాయికి చేరకుండా జాగ్రత్త పడ్డారు. బీహార్ రాజకీయాలు బీహార్‌కే పరిమితం చేయాలని ఢిల్లీ వరకు తేవద్దని లాలు, పాశ్వాన్‌లను పిలిచి మందలించారు. జార్ఖండ్‌లో అధికారం కోసం రాజ్యాంగాన్ని పక్కన పెట్టటం మంచి సాంప్రదాయం కాదని సోరెన్‌ను ఒప్పించి రాత్రికి రాత్రే రాజీనామా చేయించారు. మణిశంకర్ అయ్యర్, చిదంబరంల మధ్య పొరపొచ్చాలు తలెత్తినప్పుడు సరి చేశారు. మొదట్లో ఒడిదుడుకులతో మొదలైన విదేశాంగ విధానాన్ని కొన్ని పరిమితులతోనైనా దారిలో పెట్టటానికి మన్మోహన్ తన పాలనా సామర్థ్యాన్ని ఉపయోగించి నట్వర్‌సింగ్‌ను ఒప్పించారు. మంత్రివర్గంలో హోదాతో సంబంధం లేకుండా ఎవరైనా తన ముందుకు సమస్యలతో వచ్చినప్పుడు వారితో విపులంగా చర్చించటం ద్వారా ద్వితీయ శ్రేణి మంత్రులను కూడా ఆకట్టుకుంటున్నారు. అంతేకాదు ఐఏఎస్ అధికారులు కూడా తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి నేరుగా తనతో చెప్పుకోవచ్చని స్వేచ్ఛనిచ్చారు. ఈవిధంగా మన్మోహన్ సమర్థుడైన దళపతి అన్న గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అందువల్లనే ఏడాది పాలన పూర్తి చేస్తున్న సందర్భంగా జరిగిన ఎఐసిసి సమావేశంలో సోనియాగాంధీ మన్మోహన్‌ను ఉద్దేశించి ఆయన సమానుల్లో ప్రథముడు అని ప్రకటించి, యుపిఏకు ఆయనే తిరుగులేని దళపతి అన్న సందేశాన్ని ఇచ్చారు.

కలాం, సోనియాలతో....

తనదైన వ్యక్తిత్వం

చివరిగా ఒక విషయం స్పష్టంగా చెప్పాల్సిఉంది. ప్రధానమంత్రి డమ్మీ అని చెపుతున్నవారు ఆయన వ్యక్తిత్వంలోని విలక్షణతను గుర్తించ నిరాకరిస్తున్నారు. ఆయన మర్రి చెట్టు వంటి వాడు కాదు. చల్లని నీడనిచ్చే వేపచెట్టు వంటివాడే. ప్రధానమంత్రి తనదైన వ్యక్తిత్వం కలిగినవాడు. ఆయనకున్న వ్యక్తిగత గౌరవం పార్టీకి ఒక ఆస్తి. ఆయనకు వ్యక్తిగత భేషజాలు ఏమీ లేవు. తనకంటూ చేసుకోవాల్సింది ఏమీ లేదు. అందువల్లనే ఆయన కాంగ్రెస్ తరపున సంకీర్ణ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నారు. ఆయన ప్రస్తుతం నిర్వహిస్తున్న పదవి ఆయన ఊహించింది, ఆశించింది అంతకంటే కాదు. అందువల్లనే సాధ్యమైనంతవరకు ఈ పదవిపై తనదంటూ విలక్షణ ముద్ర వేయటానికి మన్మోహన్‌సింగ్ ప్రయత్నిస్తున్నారు. 1984 సిక్కుల ఊచకోత విషయంలో కాంగ్రెస్ పార్టీ తరపున దేశానికి ప్రత్యేకించి సిక్కు సమాజానికి క్షమాపణలు చెప్పటం ఎంతో రాజకీయ పరిణతితో కూడుకున్న చర్య. అంతేకాదు... తద్వారా గుజరాత్‌లో మోడికి, ఢిల్లీలో వాజ్‌పేయి, అద్వానీలకు మరింత క్లిష్టపరిస్థితులు తెచ్చి పెట్టే రాజకీయ చర్య. అప్పటి వరకు కాంగ్రెస్ పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సిక్కులు, వారికి ప్రతినిధినని చెప్పుకునే అకాలీలు కూడా ఈ దెబ్బతో కిమ్మనకుండా ఉండిపోవాల్సిన పరిస్థితి కల్పించారు. అదేవిధంగా ఖలిస్తాన్ ఉద్యమం ఊడలమర్రిలా విస్తరించటంలో ఎవరి పాత్ర ఎంత ఉందో చరిత్ర నిర్ధారిస్తుందని ప్రకటించటం ద్వారా ఈ ఉద్యమంలో అకాలీల పాత్ర గురించి హెచ్చరించారు. ఇటువంటి రాజకీయ సాహసాలు మరికొన్ని ఉన్నాయి. ఇంకా మూడున్నర సంవత్సరాల పాటు అధికారం కొనసాగించేందుకు అవకాశం ఉన్న మన్మోహన్‌సింగ్ నుండి ఇటువంటి రాజకీయ సాహసాలు ఆశించవచ్చని నానావతి నివేదికపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగాలు ఆశలు రేకెత్తిస్తున్నాయి. ✤



అప్పటి ప్రధాని పివీతో



గులాంనబీ ఆజాద్ తదితరులతో...



డా॥ టి. సేవకుమార్

దోమలకు దూరంగా ఉందాం...

వర్షాకాలం వచ్చిందంటే దానితోపాటే దోమలు కూడా వృద్ధి చెందుతాయి. ఈ దోమల వల్ల అనేక రకాల జబ్బులు, అసౌకర్యాలు కలుగుతాయి. మానవునికి ఇంత హానికల్గించే ఈ దోమలు ఎలా వృద్ధి చెందుతాయో, వాటిని నివారించడం ఎలాగో తెలుసుకుందాం.

ప్రకృతిలో సుమారు మూడువేల జాతుల దోమలున్నాయి. వాటిలో ఎనాఫిలిస్, క్యూలెక్స్, ఎడిస్, జూపిలిక్ వంటి రెండు వందల జాతుల దోమలు మానవుల్లో ప్రాణాంతక హానికారక సూక్ష్మజీవులకు వాహకాలుగా పనిచేస్తున్నాయి. అంటే.. దోమలు వ్యాధికారక సూక్ష్మజీవులను కల్గి ఉండటం వల్ల వాటికి ఎలాంటి హానీ ఉండదు. అందువల్లనేమో అవి భూగోళంపై అదుపులేని అలజడిని సృష్టిస్తున్నాయి. మనదేశంలోని 84 శాతం ప్రజలు దోమల ద్వారా విజృంభించే వ్యాధులు వ్యాప్తి చెందగల ప్రమాదకర ప్రాంతాలలో నివసిస్తున్నారని అనేక సర్వేలలో వెల్లడయింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ముఖ్యంగా వర్షాకాలంలో దోమల మూలంగా మూడు రకాల వ్యాధులు విజృంభిస్తున్నాయి. అవి జపనీస్ ఎన్‌సెఫలైటిస్, మలేరియా, ఫైలేరియా. నేడు ఈ వ్యాధులు ప్రపంచానికే ఒక సవాల్‌గా పరిణమించాయంటే అతిశయోక్తి కాబోదు. డెంగీఫీవర్ కూడా కొన్ని రాష్ట్రాలలో అప్పుడప్పుడు దర్శనమిస్తూనే ఉంది.

కొద్దిపాటి నిల్వ నీరు ఉంటే చాలు దోమల వృద్ధి బహుసులభంగా జరుగుతుంది. మురికి గుంటలు, సెప్టిక్ ట్యాంకులు, పాతటైర్లు, పూలకుండీలు, చెట్ల తొర్రలు, వాడని నీటి తొట్లు, పారేసిన మూతలేని సీసాలు, డబ్బాలు, కుండలు ఇలా ఎక్కడ కాస్త నీరు నిల్వ ఉండే చోటు ఉంటుందో అక్కడల్లా దోమలు చేరి గుడ్లు పెడతాయి. ఆడదోమ ఒక్కోదఫా వంద నుంచి మూడు వందల గుడ్లు పెడుతుంది. జీవితకాలంలో సుమారు 12 సార్లు దోమ గుడ్లు పెడుతుందని పరిశోధనల్లో తేలింది. సగటున ఒక ఆడదోమ నుంచి ఒక నెలలో 800 దోమలు వృద్ధి చెందుతాయి. జీవితకాలంలో దోమలు ఎనిమిది కిలోమీటర్ల వరకూ వలస పోగలవు. వీటి జీవితకాలం ఒకటి, రెండు నెలలుంటుంది. సంవత్సరంలో జులై నుంచి సెప్టెంబర్ వరకూ దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుంది.

దోమలు మనిషి రక్తం పీల్చిన తర్వాత గోడల మీద, ఇంటి ఉపరితలం మీద ఆశ్రయం పొందుతాయి. వీటిపై క్రిమి సంహారక మందులు చల్లాల్సి ఉంటుంది. ఈ చర్యలన్నీ ఒక ఇంట్లోని వారు మాత్రమే తీసుకుంటే పెద్ద ప్రయోజనం ఉండబోదు. ప్రజలంతా చైతన్యవంతులై ఇలాంటి కార్యక్రమాలకు పూనుకోవాలి. ఎవరికి వారు దోమకాటు నుంచి తప్పించుకొనేందుకు దోమతెరలు కూడా వాడాలి.

వీటి వృద్ధిని నిరోధించడం ఎలా?

ముఖ్యంగా ప్రజలు ఎవరి ఇంటి పరిసరాలను వారు ఎల్లప్పుడూ చెత్తాచెదారం లేకుండా, మురికినీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటిలోగానీ, ఇంటి ఆవరణలో గానీ నీళ్ళ కుండీలు, ఇంటిపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల మీద దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు అమర్చుకోవాలి. కనీసం వారానికి ఒకసారి నీరు నిల్వ ఉండే తొట్లను, పాత్రలను ఖాళీ చేయాలి. పనికిరాని సీసాలు, డబ్బాలు, రబ్బరు ట్యూబులు, టైర్లు, మరే పాత్రలైనా సరే నీరు నిల్వ ఉండకుండా ఉంచాలి. వీటిలో నీరు నిలిస్తే వారం రోజుల్లో దోమలు పెరగగలవు. వాడకంలేని బావులు పూడ్చాలి. సెప్టిక్ ట్యాంక్‌ల గొట్టాలపై గాజుగుడ్డ లేదా పల్చని గుడ్డ చుట్టాలి. దీని వలన దోమలను నివారించవచ్చును. మున్సిపల్ సిబ్బంది మీ దగ్గరకు వచ్చినప్పుడు వారితో సహకరించి దోమల నిర్మూలన కార్యక్రమాలకు సంపూర్ణ చేయూతనివ్వాలి. వీటన్నింటితోపాటు దోమల నిర్మూలనకు డి.డి.టి., బిహెచ్‌సి, పైరిత్రమ్, బేటిక్స్ వంటి క్రిమిసంహారక మందులకు కూడా అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. దోమలు మనిషి రక్తం పీల్చిన తర్వాత గోడల మీద, ఇంటి ఉపరితలం మీద ఆశ్రయం పొందుతాయి. వీటిపై క్రిమి సంహారక మందులు చల్లాల్సి ఉంటుంది. ఈ చర్యలన్నీ ఒక ఇంట్లోని వారు మాత్రమే తీసుకుంటే పెద్ద ప్రయోజనం ఉండబోదు. ప్రజలంతా చైతన్యవంతులై ఇలాంటి కార్యక్రమాలకు పూనుకోవాలి. ఎవరికి వారు దోమకాటు నుంచి తప్పించుకొనేందుకు దోమతెరలు కూడా వాడాలి. ఇలా ఎన్నో విధాలుగా స్వల్ప ఖర్చుతో తగు ముందు జాగ్రత్తల ద్వారా దోమల వృద్ధిని నివారించాలి. తద్వారా దోమల నుంచి వ్యాపించే జబ్బుల నుంచి తప్పించుకోవాలి. ✤



కథ

చెదిరిన జ్ఞాపకాలు

సిహెచ్ కాశీ విశ్వనాద్

"నాన్నా! రేపటిలోగా వర్క్‌బుక్స్ కొనుక్కోకపోతే బడికి రావద్దని టీచర్ చెప్పారు. అవి కొనిచ్చేంతవరకూ నే స్కూలుకెళ్లను" అంటూ పెద్దోడు ముసుగు తన్ని పడుకున్నాడు.

వాణ్ని లేపుదామని దుప్పటి లాగేసరికి వీపుమీద ఎర్రని వాతలు కనిపించాయి. వర్క్‌బుక్ తెచ్చుకోలేదని టీచరు వాడిపై చూపించిన ఆగ్రహానికి గుర్తుగా ఉన్నాయవి. మనసంతా కకావికలమైపోయింది. ఇక వాడిని లేపదల్చుకోలేదు. ఇవతలకొచ్చి అరుగుమీద కూలబడ్డాను. ఎడతెరిపిలేని ఆలోచనలతో బుర్రవేడెక్కింది.

"ఏటయ్యా అలా కూకుండి పోయావు. ఇంటో బియ్యం, సరుకులేవీ లేవని చెప్పానా...! నాలుగురోజులనుంచీ చెబుతున్నా పట్టించుకోవడం లేదు...! ఇక ఈ సంసారాన్ని ఈదడం నావల్ల కాదు...!" అంటూ ఇంటావిడ సణుగుడుతో ఆందోళన మరింత తీవ్రమయింది.

అయినా కళ్లు మూసుకుని గోడకు వీపానించి కాళ్లుజాపి సాగిలపడిపోయాను. లేవాలనింపించినా అవయవాలు సహకరించడం లేదు. ఎందుకో ఉన్నట్టుండి ఒక్కసారిగా పాతికేళ్లనాటి సంఘటన కళ్లముందు కదలాడింది.

* * *

"ఒరేయ్! నిన్ను చదివించడం మా వల్ల కాదురా! నువ్వూ పెద్దోళ్లిద్దరిలాగా కూలో నాలో చేసుకుంటే పోద్ది. పుస్తకాలకీ, ఫీజులకీ డబ్బులియ్యాలంటే మా కాడలేవే..! కడుపులోకి కూడెళ్లడమే కష్టంగా ఉంది...!" అంటూ అమ్మ విసుక్కుంది.

అప్రయత్నంగా నాకు కళ్లలో నీళ్లు తిరిగాయి. నేనప్పుడు ఎనిమిదో తరగతి. చదువంటే ప్రాణం. ఒక్కోపూట బడి మానెయ్యాలంటే నా వల్లకాదు. అయినా అప్పుడప్పుడూ ఎగనామం పెట్టి అన్నలతో కలిసి కూలికెళ్లాల్సొచ్చేది. అన్ని ఇబ్బందులెదురైనా చదువులో ఫస్టుండేవాడిని. ఏదో రకంగా చివరి పరీక్షలు రాశాను.

సెలవులనంతరం బళ్లు తెరిచారు. స్కూలుకెళ్లి ఎన్ని మార్కులొచ్చాయో చూశాను. రెండో ర్యాంకొచ్చింది. వెంటనే మా అయ్యకు, అమ్మకు చెప్పాను. వాళ్ల ఆనందానికి అవధుల్లేవు. ఎలాగైనా సరే నన్ను చదివించాలని ధృడనిశ్చయానికొచ్చారు. ఎందుకంటే చాలా రోజుల కిందటే ఇంట్లో జరగడం లేదని పెద్దన్నయ్య ఏడో తరగతిలోనే బడి మానేయాల్సొచ్చింది. పెళ్లయ్యాక వేరు కాపురం పెట్టాడు. దీంతో రెండో అన్నయ్య చదువూ ఏడో తరగతికే పరిమితమైంది. ఇక నలుగురు అక్కల్లో ఎవరికీ చదువులేదు. వాళ్లందరికీ పెళ్లిళ్లు చేసేసరికి అయ్యకి, అమ్మకి నవనాడులూ కుంగిపోయాయి. ప్రస్తుతం నాకు తిండిపెట్టి, పుస్తకాలకు, ఫీజులకు ఖర్చు పెట్టే పరిస్థితి లేదు.

ఎప్పటిలాగే బడికెళ్తున్నాను. తొమ్మిదో తరగతిలో చేరాను. ఉదయాన చింతకాయ పచ్చడితో జొన్న సంకటి తినేసి వెళ్లే వాడిని. మధ్యాహ్నం వచ్చి కుండలో అడుగున మిగిలే దానితోనే కడుపు నింపుకునే వాణ్ని. సాయంత్రం వరిగె అన్నం తినే వాళ్లం. అమ్మా అయ్య రోజంతా కూలికెళ్లి పొద్దుపోయాక వచ్చేవాళ్లు. ఆ డబ్బుల్తోనే అమ్మ సంసారాన్ని నెట్టుకొచ్చేది.

పది నిమిషాల్లో ఓ సత్తు గిన్నెతో వచ్చింది. ఎవరైనా చూస్తారేమోనని చెంగు చాటున పెట్టుకుని తెచ్చింది. అందులో కుండ అడుగున గీకితే వచ్చేటువంటి జొన్న సంగటి మాడుచెక్కలున్నాయి. దాన్ని నా పళ్లెంలో పెడుతూ చీరకొంగు నోటికడ్డం పెట్టుకుని బాధను దిగమింగుకుంటోంది.

రోజులు భారంగా గడుస్తున్నాయి. ఓ రోజు మధ్యాహ్నం బడి నుంచి ఇంటికెళ్లాను. బాగా ఆకలిగా ఉంది. అమ్మ ఆరోజు సగం పూటే పనిచేసినట్లుంది. నేను వెళ్లేసరికి ఇంటికొచ్చేసింది. కాళ్లూ చేతులు కడుక్కొని కుండమీద మూకుడు తీశాను. అందులో జొన్న సంకటి లేదు. శుభ్రంగా గీకేసినట్లుంది. మా అమ్మ పడుకుని ఉంది. లేపాను. ఆమె కూడా మధ్యాహ్నం ఏమీ తిన్నట్లు లేదు. చాలా నీరసంగా కనిపించింది.

"అమ్మా! బాగా ఆకలవుతోంది...! కుండలో అన్నం లేదు. తొందరగా వండి పెట్టవూ..!" అనడిగాను.

అమ్మ కళ్లల్లో నీళ్లు తొంగిచూశాయి. పైట చెంగుతో కళ్లు తుడుచుకుంటూ "ఇప్పుడే వస్తానుండయ్యా...!" అంటూ పక్కింటికెళ్లింది.

పది నిమిషాల్లో ఓ సత్తు గిన్నెతో వచ్చింది. ఎవరైనా చూస్తారేమోనని చెంగు చాటున పెట్టుకుని తెచ్చింది. అందులో కుండ అడుగున గీకితే వచ్చేటువంటి జొన్న సంగటి మాడుచెక్కలున్నాయి. దాన్ని నా పళ్లెంలో పెడుతూ చీరకొంగు నోటికడ్డం పెట్టుకుని బాధను దిగమింగుకుంటోంది. ఆ దృశ్యం నా కంట్లో పడింది. పరిస్థితి అర్థమైంది. ఇక నా చదువు ముందుకు సాగదని గ్రహించాను. మరుసటి రోజు నుండి బడి మానేశాను.

ఆపాటికే రెండో అన్నయ్య వివాహమైంది. ఆయనా వేరు కాపురం పెట్టడానికి సిద్ధమయ్యాడు. అమ్మకు, అయ్యకు యాభైఏళ్లుపైబడ్డాయి. పనిచేయలేకపోతున్నారు. ఎలాగైనా సరే వాళ్లకు ఆసరాగా నిలవాలనుకున్నాను. పలుగూ పార చేతబట్టి కూలిపనికి సిద్ధమయ్యాను. పనులకెళ్తున్నప్పుడు బడికెళ్లే పిల్లలను చూసి ఏడుపొచ్చేది. ఆ తర్వాత ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపాను. నిద్రలోనే వెక్కి వెక్కి ఏడ్చేవాణ్ని.

* * *

ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్లు తెరిచాను. చిన్నోడు సరిగా అన్నం తినడం లేదని వాళ్లమ్మ కేకలు వేస్తోంది. జ్ఞాపకాల పొరల్లోంచి మెల్లగా బయటపడ్డాను. ఎదురింటి టీవీలో వార్తలొస్తున్నాయి. ముఖ్యమంత్రి ఏదో సభలో ప్రసంగిస్తున్నట్లున్నాడు. సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఏకరువు పెడుతున్నాడు. పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పథకాలు గురించి ఉపన్యాసం దంచేస్తున్నాడు. అది విని నవ్వుకుంటూ లేచాను. పెద్దోడికి వర్క్‌బుక్స్ కొనివ్వడానికి ఎవరిని అప్పు అడగాలా అని ఆలోచిస్తూ ఇంట్లోంచి బయటపడ్డాను.

✤

శాంతిమిత్ర

ఎం.డి.శాస్త్రాన్నే అమలు చేసేవాళ్లం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కవరేజి చూసుకొని, తాపీగా బయల్దేరారు వి.మార్క్ అండ్ బి.తాళ్. కొంతదూరమెళ్లాక- 'ఈ వారం ఎవరితో మన ముఖాముఖి?' అని అడిగాడు వి.మార్క్

'అర్ధరాత్రి వేళ ఆడది ఒంటరిగా నడిచిననాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం' అన్నాడు బాపూజీ. పదేపదే ప్రస్తావనకొచ్చే మహిళా బిల్లుపై ముచ్చటించటమే ఈరోజు సందర్భోచితం. పదా, ఎంపీల క్వార్టర్స్‌వేపు.' అన్నాడు బి.తాళ్.

స్కూటర్‌ని అటు పోనిచ్చాడు వి.మార్క్

xxx

తన ఛాంబర్లోంచి, బయటికి రాబోతూ కనిపించింది, బిజెపి ఎంపీ సుష్మా స్వరాజ్.

'ఒక్క క్షణం ఆగండి మేడం. మొన్న మీరు హోంమంత్రి శివరాజ్ పాటిల్‌ని కలిసి, మహిళాబిల్లుపై మాట్లాడారు కదా. అసలు మీ హయాంలో ఈ బిల్లునెందుకు తేలేకపోయారు.' లేడికి లేచిందే పరుగులా- ఉపోద్ఘాతం లేకుండానే ముఖాముఖి మొదలెట్టాడు బి.తాళ్.

'అసలు ఈ బిల్లు తేవాలని తెగ తపించింది మా పార్టీ. మిగతావాళ్లు అడ్డు పడ్డంవల్ల మేం బిల్లు తేలేకపోయాం.' అందామె, తడుముకోకుండా.

'మేడమ్... ఈ బిల్లు వద్దని మీకు అడ్డు తగిలిందెవరు? అయినా బయట జనం, లోపల కొన్ని పార్టీలూ ఎంత కాదన్నా - మందిపై భారాలు వేసే చట్టాలు చాలా తెచ్చారే మీరు.' అన్నాడు వి.మార్క్

'ఈ దేశంలో సామాన్యులకు భారాలూ, సంపన్నులకు సుఖాలూ మొదటినుంచీ అలవాటు. తరతరాల సంస్కృతీ సాంప్రదాయాలను సంరక్షించి, కొనసాగించే పార్టీ మాది. దానిని తుచ తప్పకుండా పాటించాం. దాన్లో తప్పేముంది?' సుష్మా ఎదురు ప్రశ్నించింది.

'సరే, మేడం... 'సతి'లాంటి పురాతన దురాచారాలను మీరు సమర్థించారు కదా? మరి చట్టసభల్లో మహిళా భాగస్వామ్యాన్ని పెంచే ఆధునిక ఆలోచనను మీరెలా ప్రతిపాదిస్తున్నారు. వీటి మధ్య మందికీ, మందిరానికీ ఉన్నంత తేడా ఉంది కదా.' అనడిగాడు బి.తాళ్.

'మహిళా భాగస్వామ్యాన్ని పెంచే ఆలోచనలు మా పార్టీకి మొదటినుంచీ ఉంది. ఉదాహరణకు మేం బలంగా ఉన్న రాష్ట్రాల్లో సతి సహగమనం అనే భావనకు మంచి ప్రాచుర్యం కల్పిస్తున్నాం. దానర్థం భర్తతోపాటు భార్య సమాన గౌరవం పొందాలని. స్త్రీలు నిత్యం పూజలందుకోవటానికి ఇది మంచి అవకాశం. ఆడామగా సగంసగం అన్న భావన మన వేదకాలం నుంచీ ఉంది. వేదాలను అనుసరిస్తే ఇప్పటి చట్టాలూ శాస్త్రాలతో పనిలేదు. అంతరిక్ష పరిశోధనలు కూడా వేదాల ఆధారంగా చేయొచ్చు...' ప్రసంగంలాగ సాగిపోతోంది సుష్మా మాటల ప్రవాహం.

'మేడం... అలా అయితే సరాసరి ఆదిమకాలానికి, అక్కణ్నుంచి ఆటవిక యుగానికి పోతామేమో...' బి.తాళ్ బ్రేకు వేసే ప్రయత్నం చేశాడు.

సుష్మాకి కోపం ముంచుకొచ్చింది.

'మీరు వేదాలూ పురాణాలూ చదవరు. కమ్యూనిస్టు చరిత్రకారులు రాసిన పుస్తకాలు చదువుతారు. అసలు మహిళల భద్రత గురించి మనుధర్మశాస్త్రం మన రాజ్యాంగం కన్నా ఎక్కువ

ప్రస్తావించింది. ఎంతో కట్టుదిట్టమైన ఏర్పాటు చేసింది...' ఇంకా ఏదో చెప్పబోతుంటే...

'మహిళకి బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు రక్షణ కల్పిస్తారనే కదా...' అన్నాడు బి.తాళ్.

సుష్మా మొహంలో సంతోషం.

'మీక్కూడా బాగానే తెలుసే...' అని ఓ మెచ్చుకోలు విసిరి, '...ఇంకా ఇలాంటివి చాలా ఉన్నాయి. మేము అధికారంలో ఉండి ఉంటే మనుధర్మ శాస్త్రాన్ని యథాతథంగా అమలు చేసుండేవాళ్లం. అప్పుడు 33 శాతం ఏం కర్మ! మహిళకి నూరుశాతం 'భూక్ భయ్ భ్రష్టాచార్' రక్షణ... సారీ, రహిత రక్షణ ఉండివుండేది' అని నిట్టూర్చింది.

'మేడం... మహిళలు ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడాలని, ఆర్థికంగా స్వాతంత్ర్యం సాధించాలని...' వి.మార్క్ మాట పూర్తి కాకుండానే- సుష్మా అందుకుంది.

"... అని అందరూ చెప్పే కబుర్లవల్ల దేశం బాగుపడదు. అసలు మహిళ తన కాళ్ల మీద తానే నిడబడాల్సిన అవసరం ఏముంది?' ఆవేశంగా ప్రశ్నించింది. అంతలోనే ఆయాసం కమ్ముకొచ్చి- అప్పటిదాకా తన కాళ్ల మీద నిలబడిన సుష్మా గబుక్కున కుర్చీలో కూలబడింది. గ్లాసెడు నీరు గడగడా తాగేసి, మళ్లీ కొనసాగించింది.

'అసలు సొంతకాళ్లమీద నిలబడటం ఎంత కష్టమో మీకు తెలుసా? ఆ కష్టం కూడా లేకుండా చేయాలని కదా మా పార్టీ ధ్యేయం.' అంది.

('వాజపేయి పాలనలో ఆ విషయం బాగా అర్థమయిందిలే.' అన్న వి.మార్క్ సణుగుడు ఆమెకు వినబడలేదు.)

'అలాంటి ఉద్దేశంతోనే మేం అధికారంలో ఉన్నప్పుడు పాఠ్యాంశాల్లో మార్పులు తెచ్చే ప్రయత్నం చేశాం. బాలికలకు వంటపని, ఇంటిపనిలో మెళకువలు నేర్పటానికి ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టాం. మహిళలను ఇంటికే పరిమితం చేసి, వాళ్లకు కష్టాలను దూరం చేయాలనేదే మా తపనంతా.' అని ఆగింది.

'మేడం... ఆఖరిగా ఓ ప్రశ్న. ఏమనుకోకండి' అని కుర్చీలోంచి లేచి, బయటికి నడవటానికి సన్నద్ధమవుతూ, అడిగాడు బి.తాళ్.

కొంపముంచే ప్రశ్నేమోనని కొంచెం మార్కు ముఖం పెట్టి, అయినా తప్పదని అనుకొని- 'అభ్యంతరమెందుకు, అడగండి' అంది నవ్వుతూ.

'మీరు మాత్రం ఎందుకండి ఇంతలా కష్టపడి, వీధుల్లో తిరగటం. హాయిగా ఇంట్లో కూచొని కమ్మగా పకోడీలూ పాయసాలూ చేసుకోవచ్చు కదా' అన్నాడు.

సుష్మా ముఖం వాడిపోయిన కమలంలా అయిపోయింది.

అప్పటికే వాళ్లిద్దరూ గుమ్మం దాటేశారు.

✤

తెంగ్లీష్

డా॥ జె.పి. వైద్య

"రసిక శ్రోతాస్...!"

భాష..భాషాసౌందర్యం గురించి పెద్దలు రకరకాలుగా చెప్పారు.

"ఒక్కొక్క భాషకు ఒక్కొక్కరకమైన మర్యాదలుంటాయి...తూచాలు తప్పక తెనిగించడం పెట్టుకుంటే ఈ భాషా మర్యాదలు మంటకలిసి పోతాయి "అని ఒకరు సెలవిస్తే-

''మనఃప్రపంచానికి బాహ్య ప్రపంచానికి బాహ్య స్వరూపం భాష..భాషా విప్లవమే భావ విప్లవం..." అని మరో పెద్దమనిషి బాహ్య పదాల బరువుతో చెప్పారు..

"గవన్ని పెద్దపెద్ద మాటలు మనకు రావు భై..గని-ఒక్కటి ఎర్క..! మనసుల మాట తెల్వెటట్టు చెప్పాలె..బస్! గంతే తెలుస్తది మాకు-గా కవిత్వం మనకు రాదు...సంధులు సమాసాలు తెల్వయి...గిట్ల మనసుల భావం మెరిశే అంటే గట్ల చెప్పేసుడు-''అని మామూలు మనిషి పుల్ల విరిచినట్టు చెప్పి వెళ్లిపోతాడు.

కాని, భాష మీద పట్టులేక భాష రాక-తెలియక -అర్థం కాదు అని తెలిసీతెలియక మాట్లాడే వాళ్లు కోకొల్లలు...

కొందరికి భాషను నేర్చుకోవాలి అన్న 'అవసరం' అంతగా ఉండదు. నాకు బాగా పరిచయం ఉన్న ఒక డాక్టర్ భార్య విద్యాధికురాలు...

చాలా డిగ్రీలు ఉన్నా 'తెలుగు'రాదు. వచ్చేది అంతంత మాత్రమే. హిందీ, ఇంగ్లీషు, మరాఠీలో కాలం అవలీలగా గడిచిపోతుంది... కాని, తెలుగువాళ్లు వెళ్లి 'డోర్‌బెల్' వాయించి తెలుగులో -

"నమస్తే మేడమ్! డాక్టర్ గారున్నారా?" అన్న మామూలు ప్రశ్నకు ఆవిడ జవాబు అందరినీ కితకితలాడిపించేది...

తెలుగులో 'ప్రశ్నార్థకాలు' విని ఆమె అందమైన మొహం-అన్న ప్రశ్న అర్థం కాక కందిపోయేది...ప్రశ్న 'రిపీట్' అయ్యేసరికి కంగారు పడి, కలవరపడి, వచ్చే జవాబుకు డాక్టర్‌గారే ఇబ్బంది పడిపోయి బయటికొచ్చేవారు...

ఇన్నాళ్లైనా నేటికీ ఆయన శ్రీమతి గారి జవాబు చెక్కు చెదరలేదు. -'ఆc! డాక్టర్...?!ఆcఆc !ఉన్నది...!తిన్నది...! పండుకున్నది...!"

ఈ భాషను కాని, మనుష్యుల భావాలను కాని కించపరచాలని కాదు...

రాని భాషను 'అథారిటేటివ్'గా 'ముక్కలు చెక్కలు' చేసే మహనీయులను ఆత్మీయంగా జ్ఞాపకం చేసుకుని-'అయ్యా! భాషనూ, మమ్మల్నీ చిత్రహింసలు పెట్టక మా మానాన మమ్మల్ని బ్రతకనీయండి బాబూ' అన్న భావన మాత్రమే...!" ఒక్క దమ్ములో ఇంత చాంతాడు లెక్చరిచ్చి గట్టిగా నిట్టూర్చి కూర్చున్నారు 'సారు వారు'...

అర్థం పర్థం లేకుండా ఊదరగొట్టే తెలుగు సారు మధ్యలోనే అందుకుని 'అవునవును స్మీ! చక్కగా చెప్పారు...ప్రతి గుండెలోభాష...భాషలో అందం...అయినా, ఇంత అందమైన భాష దగ్గర పెట్టుకుని...అక్కడెక్కడో ఉన్న ఇంగ్లీషు వాడి భాష ఎందుకండీ బాబూ! మన్ని మనమే వంచన చేసుకోవడం...;?ఆc!

'చుట్టూ వంచన పెరుగుతుంటే చూస్తూనే ఉన్నారా? తీరం మునుగుతు వుంటే రాగం తీస్తూనే ఉన్నారా? అని కాసేపు 'రెస్ట్' తీసుకున్నారు...కానీ ' రెస్టింగ్ టైం'లో ఘుసాయించాడు ' పెద్దమనిషి'...

ఆహాహా! ఫైన్!ఫైన్ వాట్ ఏ బ్యూటి ఫుల్ కవిత? వాట్ ఏ బ్యూటి ఫుల్ థాట్ ? వాట్ ఏ బ్యూటి ఫుల్ ఐడియా? వాట్ ఏ లవిలీ మీనింగ్...! ఆc! లెట్ మీ ట్రాన్స్‌లేట్ ఇట్ అర్జెంట్‌లీ...! యూ నో ఐయామ్ ఎ ట్యాలెంటెడ్ పోయెట్... యూసీ...! రౌండ్ రౌండ్ చీటింగ్ పెరిగింగ్...స్టిల్ సీయింగేనా? ది బ్యాంక్స్ డ్రౌనింగ్..స్టిల్ రాగం సింగింగేనా?' యూ సీ..! దిస్ ఈజ్ కాల్డ్ ఇన్స్‌స్టెంట్ పోయెట్రి...!" మేం అందరం తలపట్టుకుని స్థాణువుల్లా నిలబడిపోయాం...

ఐదు-పది నిమిషాలకు తెలుగుసారు వారు 'ఝట్కా' తిన్నట్టు కదిలి-

'అయ్యా! మీ అద్భుతమైన ఇంగ్లీషు కవితాఝురి మరీ చురకత్తిలా ఛేదిస్తున్నదండీ బాబూ...! ఆహాహ! తీరం మునుగుతూ ఉంటే రాగం తీస్తూనే ఉన్నారా;?' అని కవి తెలుగులో ఎంతందంగా పలికారు... మీరేమిటండీ బాబూ! బ్యాంకుల్ని డ్రౌనింగ్ అంటూ ముంచుతున్నారు మహానుభావా? బ్యాంకులు బోర్డులు తిప్పేస్తున్నాయి, అర్థాంతరంగా మాయమవు తున్నాయి తెలుసు కాని, కవితను, అందమైన పంక్తులను అర్థాంతరంగా ముంచే మీలాంటి మహానుభావులు ఉన్నారని తెలియదండీ ఇంతవరకు...మరీ-ఇంగ్లీషును కలి బండమీద బాదీ బాదీ చంపకుండా మీ మాతృభాషలోనే కవిత్వం రాసుకుని మురిసిపోవచ్చు కదండీ?' అన్నారు కోపం దిగమింగుతూ-కొంచెం కక్కుతూ...! సదరు షాస్త్రీగారు మౌనంగా అద్దాలు తీసి నింపాదిగా తుడిచి, బాగా శుభ్రంగా ఉన్నాయా లేదా అని వెల్తురుకేసి చూసి అద్దాల గుండా చూసి-కళ్లకు పెట్టుకుని చిన్నగా నవ్వారు...

ఆ నవ్వుల్లో జీవం ఎంత శాతముందో తెలియదు కాని-భుజాన వేలాడుతున్న సంచిలోంచి పిడికెడు కాయితాలు తీస్తున్నపుడు మట్టుకు కళ్లల్లో వింత కాంతి వెలిగింది...

యూసీ సర్! దేరార్ టూ థింగ్స్...!ఫస్ట్‌లీ-ఐయామ్ వాట్ అవేర్ ఆఫ్ మై మదర్స్ టంగ్...ఐ వెరీ స్మాల్ చైల్డ్...షీ పాస్డ్ అవే! బట్ పీపుల్స్ టోల్డ్-దట్ ఐ క్రైడ్ ఇన్ ఇంగ్లీష్...! సెకండ్లీ-యూ ఆర్ రైట్! బ్యాంక్స్ రివర్సింగ్ బోర్డ్స్ అండ్ మున్గింగ్...డిపాజిటర్స్ లైక్ మీ డ్రౌనింగ్...! బ్యాంక్ డ్రౌనింగ్...! పీపుల్స్...డిపాజిటర్స్ టూ డ్రౌనింగ్...! బట్ ఐ హ్యావ్ విత్‌డ్రాయల్ ఫార్మ్స్...! వాట్ యూజ్? సో రైటింగ్ పోయెట్రీ...అండ్ సర్ఫింగ్ శ్రోతాస్...నౌ కమాన్...! మై పోయెట్రీ స్టార్టింగ్..." అంతే!-

క్షణంలో రసిక శ్రోతలు చెట్టుకొకరు పుట్టకొకరు 'గాయబ్' అయిపోయారు.

✤

ఓ ఊరి కథ

ఎర్రగొండపాలెం వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీ కృష్ణదేవరాయలు సహకరించారని ప్రతీతి. ఈ ఆలయ గోపురం అపురూప శిల్పసంపదకు ఆలవాలం. ప్రతి వైశాఖ శుద్ధపూర్ణిమ నాడిక్కడ తిరుణాల నిర్వహిస్తారు.

షేక్ వలీ సాహెబ్

సామాన్యుల, అసామాన్యుల ఎర్రగొండపాలెం

ఎర్రగొండపాలెం ప్రకాశం జిల్లాలో ఉంది. ఎర్రగొల్లని పేర నిర్మితమైనందునే ఈ గ్రామానికి ఎర్రగొండపాలెం అనే పేరు వచ్చిందని పూర్వీకులు చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని ఎర్రగొల్లలు పాలించారని వినికిడి. ఈ గ్రామాన్ని నిన్నమొన్నటి వరకు దిగువపాలెమని ఈ ప్రాంత ప్రజలు పిలిచేవారు. కాలక్రమంలో ఎర్రకొండపాలెం "ఎర్రగొండపాలెం"గా మారింది.

ఇది 1970కి పూర్వం కర్నూలు జిల్లాలో ఉండేది. ఈ ప్రాంతం దట్టమైన నల్లమల అడవులలో విస్తరించి ఉంది. చెంచు, లంబాడీ గిరిజనులు ఇక్కడి అటవీ ఉత్పత్తులను సేకరించి జీవనం సాగిస్తున్నారు. ఈ మండలం ఆర్థికంగా, సామాజికంగా బాగా వెనుకబడి ఉంది. ఇక్కడి ప్రజల ప్రధానవృత్తి వ్యవసాయం. ఈ గ్రామానికి దక్షిణభాగంలో కొప్పుకొండపై శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానముంది. ఇక్కడున్న వేపచెట్టు ఆకులు చేదుగా ఉండవు. ఈ విషయాన్ని ప్రజలు వింతగా చెప్పుకుంటారు. ఈ ఊరికి ఉత్తర భాగంలో రాళ్ల వాగు ఉండేది. ఇది ఆ రోజుల్లో ఎప్పుడూ నిండుగా ప్రవహించేది. ప్రస్తుతం భారీ వర్షాలు పడినప్పుడు మాత్రమే ప్రవహిస్తుంది. దీనికి సమీపంలో వేణుగోపాలస్వామి ఆలయముంది. దీని నిర్మాణానికి శ్రీ కృష్ణదేవరాయలు సహకరించారని ప్రతీతి. ఈ ఆలయగోపురం అపురూప శిల్పసంపదకు ఆలవాలం. ప్రతి వైశాఖ శుద్ధపూర్ణిమ నాడిక్కడ తిరుణాల నిర్వహిస్తారు. దీన్ని వైభవంగా నిర్వహిస్తే చెరువులు నిండుతాయనీ, పంటలు పుష్కలంగా పండుతాయనీ ఇక్కడి ప్రజల నమ్మకం. ప్రస్తుతమీ దేవాలయం శిథిలావస్థలో ఉంది. ఈ గ్రామానికి పడమటివైపు వృశ్చికామల్లప్ప దేవాలయముండేది. ఇది కూడా జీర్ణావస్థలో ఉంది. ఈ ఊరికి ఉత్తరదిశలో రాళ్ల వాగుతీరంలో నన్న వెంకటేశ్వర స్వామి దేవాలయముండేది. ఇదికూడా కాలగర్భంలో కలిసి పోయింది. ప్రస్తుతం గ్రామంలో శివాలయం, రామాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, అయ్యప్ప ఆలయం, అమ్మవారి దేవాలయాలతో పాటు ఐదు మసీదులు, పదిహేను చర్చీలు గత వైభవానికి సాక్ష్యాలుగా ఉన్నాయి. అశుకవితా చక్రవర్తి, గద్వాల సంస్థాన కవులు, శతావధాన సార్వభౌములు అయిన గాడేపల్లి వీరరాఘవశాస్త్రి ఈ గ్రామ సమీపంలోని గడ్డమీద పల్లె వాస్తవ్యులు. ఆయన దూరప్రాంతాలకు వెళ్లినప్పుడ తనది రక్తన గాఖ్య పట్టణమని





చెప్పుకు నేవాడు. సంస్కృతంలో ఎర్రగొండపాలాన్ని రక్తనగాఖ్య పట్టణమంటారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు యక్కలి రామయ్య గాంధేయవాది. ఈ ప్రాంతం నుంచే ఆయన ఖద్దరు ఉద్యమానికి ఆలంబనగా నిలిచారు. అభినవ నన్నయ్య బిరుదాంకితులైన రాళ్లబండి నరసింహ శాస్త్రి ఈ గ్రామ వాస్తవ్యులే. ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ ప్రాంతమిప్పటికీ వెనుకబడి ఉంది. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ఇక్కడి ప్రజలనాదుకునేందుకు ఎలాంటి పరిశ్రమలూ లేవు. ఫలితంగా జీవన భృతి కోసం సుదూర ప్రాంతాలకు వలసెల్లాల్సి వస్తోంది. ✤

అమ్మో.... పాము!



గోవింద్ ఓ రైలులోకి ఎక్కాడు దాన్నిండా ఇసుకవేస్తే రాలనంత జనం ఉన్నారు. గోవింద్‌కు సీటు దొరికే పరిస్థితి లేదు. ఒక ఉపాయం ఆలోచించాడు.

"పాము... పాము" అని అరిచారు. గట్టిగా. పాము అనే మాట వినగానే అందరూ హడలెత్తి పోయారు. తమ సామానంతా పట్టుకొని బోగిలోంచి దూకేశారు. అంతా ఖాళీ అయిపోయింది.

"హమ్మయ్య, ఇక ఏ బాధాలేదు. హాయిగా పడుకుంటా. తెల్లారేసరికి మద్రాసుకు చేరుకుంటా". అనుకుంటూ బెర్త్ మీద నిద్రపోయాడు.

తెల్లవారింది. "చాయ్... చాయ్, కాఫీ..., కాఫీ.... అనే అరుపులు వినిపించి మెలకువలోకి వచ్చాడు గోవింద్." మాద్రాస్ వచ్చేసిందా ? అనడిగాడు టీలమ్మే వ్యక్తిని.

దానికతడు " మద్రాసేంటి ? అసలీ భోగి ఎక్కడికీ వెళ్ళలేదు. దీన్లోకి పావు వచ్చిందని ఇక్కడే వదిలేసి వెళ్ళారు. అని చెప్పాడు నిదానంగా.

పెండెం జగదీశ్వర్

అవీ... ఇవీ

పార్కింగ్ ఫైన్

నో పార్కింగ్ స్థలాలలో వాహనాలను నిలిపిన వారికి పోలీసులు జరిమానా వడ్డించటం గురించే మనకు తెలుసు. అమెరికాలోని చికాగో నగరంలో పార్కింగ్ స్థలంలో కార్లు ఉంచిన వారు కూడా జరిమానా చెల్లించాల్సి వస్తోంది. అయితే ఇక్కడో చిన్న తిరకాసుంది. హైదరాబాద్‌లో పార్కింగ్ స్థలం లేకుండా బడా వాణిజ్య భవనాలకు అనుమతివ్వటం ఒక రివాజు. ఎవరున్నా అది కొనసాగుతోంది. ఫలితంగా మనం ఖాళీ ఉంది కదా అని వాహనం పార్కింగ్ చేశామో సార్ మీరు ఎక్కడకు వెళ్లాలని అడుగుతూ కాపాలాదారొస్తాడు. అదే షాపైతే ఫరవాలేదు పక్క షాపైతే దయచేయమని నిర్మొగమాటంగా చెబుతాడు. చికాగోలో కూడా బహుశా అలాంటి సమస్య వచ్చిందేమో. షాపుకొచ్చిన వినియోగదారులను ఏం కావాలి సార్ అనటానికి ముందు ఎక్కడ పార్కింగ్ చేశారు సార్ అని మర్యాదగా అడుగుతున్నారట. వారి స్థలంలో అయితే ఏ చిక్కూలేదు. పక్కవాడి స్థలంలో పెడితే మాత్రం వెంటనే వెళ్లి తీయండి సార్ 115 డాలర్ల ఫైన్ (మన రూపాయలలో నాలుగున్నరవేలకు పైమాటే) కట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఒక వినియోగదారుడు కదల్లేని భార్యను కారులోనే కూర్చోబెట్టి షాపుకెళ్లి వచ్చి చూసే సరికి భార్యతో సహా కారును వేరే చోటకి తరలించేశారని వాపోయాడు. ఇలాంటి సీన్లు రోజుకు కనీసం 20-25 ఉంటాయని షాపుల వారు చెబుతున్నారు.

పర్వ దినాలు

రెండక్షరాల కోటపై నుంచి
ఏటొక్కసారి ప్రసంగించేరు.
ఎవరైతేనేమి....
కోట ముందు భాగాన

ప్రజానీకాన్ని సంబోధించి
సంబరపరచే ప్రసంగాలు
కోట్టెనుక భాగాన
యమున సాక్షిగా పెరుగుతూనే వుంది.

దరిద్రనారాయణుల భారతం
దినం దినం ఐతేనేం
అంతా సజావుగానే వుందనే
సెంట్రీనాదం పహరా హోషియార్

హోషియార్
అంటూ సాగుతూనే ఉంటాయి.
ప్రసంగాల పర్వదినాలు
ప్రతియేట....!

ఎం. అరుణ్‌కుమార్



"బుర్రలోనే లాఠీ పెడితే పోలా..."

విజ్ఞాన వీచిక

అంటువ్యాధులు ప్రబలకుండా వ్యాక్సిన్‌లు వేసుకోవడం త్వరలోనే పాత ఫ్యాషన్ అయిపోబోతోంది. ఎందుకంటే అంటువ్యాధుల్ని అరికట్టే కాయగూరలు, ఆకుకూరలు తయారవుతున్నాయి గనుక. క్యాన్సర్ వంటి రోగాలు రాకుండా చేసుకోవడం చాలా సులువైపోబోతోంది. ఎందుకంటే మన శరీరంలో క్యాన్సర్ కారకాలను నిరోధించే బంగాళాదుంపలు, ఆకుకూరలు తయారవుతున్నాయి గనుక.

ఎస్. వెంకట్రావు

కేన్సర్‌ను మట్టుబెట్టే క్యాబేజీ

రానురాను తాజా పండ్ల స్థానాన్ని, టిన్నుల్లో భద్రపరిచే పండ్లరసాలు ఆక్రమిస్తున్నాయి. దాని వల్ల తాజా పండ్లకుండే సువాసన, రుచి పోతోందనే బాధ ఇకపై మనకు అక్కరలేదు. ఎందుకంటే శాస్త్ర వేత్తలు లేబరేటరీల్లో ప్రస్తుతం తయారుచేస్తున్న మొక్కలు గనక క్షేత్రాల్లోకి వచ్చేస్తే ఇకపై టిన్నుల్లో పెట్టిన పండ్లరసాలకు తాజాదనం, రుచి ఎన్నాళ్లున్నా ఎక్కడికీ పోదు. పైగా పండ్లకు మధుర సువాసనలను మనకు కావలసినంత మోతాదులో సమకూర్చుకోవచ్చు. టమాటా రసం, పేస్టు టిన్నుల్లో పెట్టినా అప్పుడే తయారుచేసిన పేస్టు మాదిరిగా ఉండేట్లు చేసుకోవచ్చు!

నిజమేనా...అలాంటివి తయారుచేయవచ్చా?

ఇవన్నీ ఎలా సాధ్యం అనుకుంటున్నారా? జెనిటిక్ ఇంజనీరింగ్‌లో జరుగుతున్న పరిశోధనలు త్వరలోనే ఈ విచిత్రాలను సుసాధ్యం చేయబోతున్నాయి. ఇప్పటివరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు మొక్కల్లో మనకు కావలసిన లక్షణాలను హైబ్రిడ్ పద్ధతుల్లో ప్రవేశపెడుతూ వచ్చారు. ఇప్పుడు జెనిటికల్ ఇంజనీరింగ్ ద్వారా నేరుగా మొక్కల్లో మనకు కావలసిన లక్షణాలను ప్రవేశపెట్టడం సాధ్యమవుతోంది. ఇప్పటికే మార్కెట్‌లోకి అనేక రకాల ''జన్యుమార్పిడి ఆహారపదార్థాలు'' వచ్చాయి. ఉదాహరణకు జన్యుమార్పిడి పద్ధతిలో ఉత్పత్తి అయిన మొక్కజొన్న, సోయా చిక్కుడు అమెరికా మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. అయితే ఐరోపాలో మాత్రం ఇటువంటి జన్యుమార్పిడి ఆహారానికి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. అయినప్పటికీ జన్యుమార్పిడి ఆహారంలోని సౌలభ్యం రీత్యా వీటిపై విపరీతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. జన్యుమార్పిడితో రకరకాల ఆహారపదార్థాలు తయారుచేయడానికి ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. ఆ ప్రయత్నాల్లో భాగంగానే ఇటీవల బ్రిటన్‌లో మొట్టమొదటి జన్యుమార్పిడి ఆహార పదార్థం- టమాటా పేస్టు - సూపర్ మార్కెట్ షెల్ఫ్‌ల్లోకి ఎక్కింది. సాధారణ పద్ధతుల్లో టమాటాలు ఇంకో పచ్చిగా ఉండగానే చెట్లనుండి కోసి కృత్రిమంగా పండేట్లు చేస్తారు. అప్పుడు దానినుండి పేస్టు, రసం వగైరా తీసి టిన్నులకు ఎక్కిస్తారు. దీనివల్ల టమాటాకు సాధారణంగా పండేప్పుడు వచ్చే సువాసన రాకుండా పోతుంది. కాని ఇప్పుడు శాస్త్రవేత్తలు జెనిటిక్ ఇంజనీరింగ్ ద్వారా టమాటాలోని సువాసన యథాతథంగా ఉండడమే కాదు, అది మరింత సువాసన భరితంగా ఉండేట్లు చేయగలిగారు. ఇప్పుడు బ్రిటన్‌లో ఇటువంటి టమాటా పేస్టుకోసం ప్రజలు ఎగబడుతున్నారట. ఈ పేస్టుకు జన్యుమార్పిడిద్వారా శాస్త్రవేత్తలు మరికొన్ని లక్షణాలు కూడా వచ్చేట్లు చేశారు. జన్యుమార్పిడి టమాటా పేస్టులో నీటి శాతం తక్కువ ఉంటుంది. అందువల్ల రుచికూడా సాధారణ టమాటా పేస్టుతో పోలిస్తే ఎక్కువగా ఉంటుంది. పైగా జన్యుమార్పిడి టమాటా పేస్టు పిస్తా, పిజ్జా బేస్‌లకు త్వరగా అతుక్కుంటుందట.

క్యాబేజీ-కోసుకూర

జన్యుమార్పిడి కాయ గూరల్లోని తమాషా టమాటాలతో ఆగిపోలేదు. క్యాన్సర్ నివారించే క్యాబేజి



కూర, కోసుకూరలను జన్యుమార్పిడి పద్ధతుల్లో రూపొందిస్తున్నారు. కాయగూరల్లో వాటికి రుచి, వాసనలు ఇచ్చే రకరకాల 'ఫైటోకెమికల్స్' (మొక్క సంబంధమైన రసాయనాలు) ఉంటాయి. కొన్నిరకాల 'ఫైటోకెమికల్స్' మొక్కలను ఇతర చీడపీడలనుండి రక్షిస్తాయికూడా. క్యాజేజి కూర, కోసుకూరల్లో 'సినిగ్రిన్' అనే పదార్థం, దాని నుండి ఉత్పత్తి అయ్యే 'ఐసోథియోసియానేట్' అనే పదార్థం జంతువులను క్యాన్సర్‌నుండి రక్షిస్తాయి. ఈ రసాయనిక పదార్థాలు మన శరీరంలోని కాన్సర్ కారక కణాలపై పనిచేసి అవి క్యాన్సర్ కణాలుగా 'ఎదగక'ముందే 'ఆత్మహత్య' చేసుకునేట్లు చేస్తాయి. క్యాబేజీ కూరలో ఉండే 'సల్ఫోరఫేన్' అనే పదార్థం క్యాన్సర్ కారక రసాయనాలను అంతం చేస్తుంది. ఇప్పుడు నార్విచ్ పరిశోధనా పార్కుకు చెందిన శాస్త్రవేత్తలు ఈ సల్ఫోరఫేన్‌కు మాతృక అయిన 'గ్లూకోరఫెనిన్' అనే పదార్థం ఎక్కువగా ఉండే క్యాబేజీ కూర మొక్కలను తయారుచేస్తున్నారు. ఈ కూర తింటే ఇక మనకు క్యాన్సర్ రాదు. ఇది జయప్రదమైతే ఈ టెక్నాలజీని ఇతర కూరగాయలకు బదిలీచేస్తామని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పని తొందరగా జరిగితే మానవాళికి క్యాన్సర్ మహమ్మారి పీడ విరగడవుతుంది కదా!

ఇక టీకాలకు టాటా...బైబై...ఛీరియో

జన్యుమార్పిడి పరిశోధనలు అక్కడితో ఆగిపోలేదండీ! మన శరీరంలో క్యాన్సర్‌ను కలిగించే 'ఫ్రీ రాడికల్స్'ను తటస్థీకరించే ఆక్సిడెంట్లు అధికంగా గల కూరగాయలు, పండ్లను పెద్దఎత్తున ఉత్పత్తిచేయడానికి పరిశోధనలు సాగుతున్నాయి. అలాగే పండ్లు, కూరగాయల్లో విటమిన్ల శాతాన్ని పెంచేందుకు కూడా జన్యుమార్పిడిపద్ధతులు ఉపయోగిస్తున్నారు. ఇంకా కొన్ని పరిశోధనలు ఒక కొలిక్కి వస్తే మనం కలరా వంటి అంటువ్యాధుల నివారణ కోసం వ్యాక్సిన్లు వేసుకోనక్కరలేదు. మనం తినే ఆహార పదార్థాలే ఆ పనిచేస్తాయి. మనం తినే బంగాళదుంపలు, అరటిపండ్లలో కొన్ని నిర్ధిష్టమైన రోగాలను పోలిన 'డమ్మీ' ప్రోటీనులు ప్రవేశపెడతారు. వాటిని తినగానే శరీరం ఆ ప్రోటీనులకు 'యాంటీబాడీలు' తయారు చేసుకుంటుంది. ఫలితంగా శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంటే మనం ఇకపై యాంటీ బయోటిక్ మందులు వాడ్డానికి బదులు ఎంచక్కా జన్యుమార్పిడి పండ్లు, కూరగాయలు తింటే సరిపోతుందన్నమాట. ఇప్పటికే బేకరీల్లో జన్యుమార్పిడి ద్వారా రూపొందించిన ఈస్టు వంటి పదార్థాలు బాగా ఉపయోగించుకుంటున్నారు. మామూలు పాలనుండి జున్ను తయారుచేసే ఏజెంట్లను జన్యుమార్పిడి ద్వారా రూపొందిస్తున్నారు. ఇక్కడితో అయిపోలేదు....కావలసిన సువాసనలతో, కావలసిన రుచుల్లో రకరకాల పండ్లు, కూరగాయలు లేబరేటరీల్లో రూపొందించుకునే రోజులను జన్యుమార్పిడి సాంకేతిక పరిజ్ఞానం త్వరలోనే మనముందుకు తేనుంది. ఇవన్నీ మనకు ఎంతో దూరంలో లేవండి! వచ్చేస్తున్నాయ్! త్వరలో మన మార్కెట్లను ముంచెత్తబోతున్నాయ్! ✤

కొత్త పుస్తకాలు

గ్లోబల్ విషాద కవిత్వం

గ్లోబలైజేషన్ మన జీవనశైలిని సమూలంగా మార్చేసింది. ఫలితంగా సాహిత్యంలో సరికొత్త వస్తువును దర్శించి, నూతన అభివ్యక్తిని పట్టుకోవలసిన అవసరం కవులకేర్పడింది.

ఇవ్వాళ జీవితం గాయాల మయం. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి గాయాన్నీ పదే పదే తడుముకోవలసిన అవసరమొచ్చింది. ఈ నేపథ్యం నుండి వచ్చిన కవితా సంపుటి గవిడి శ్రీనివాస్ "కన్నీళ్ళు సాక్ష్యం".

ప్రపంచీకరణ అన్ని రంగాలనూ ప్రభావితం చేసింది. దీని ప్రభావం వల్ల మానవ సంబంధాలు యాంత్రికమయమయ్యాయి. మనిషి ఎడబాటుకు, ఒంటరితనానికి గురవుతున్నాడు.

కవి " ఒంటరిని రాలుస్తూ" కవితలో ఇలా అంటాడు.

పొగల కెరటాల్లో నీ మనస్సునొదిలేస్తూ/అందని నీ కిటికీ చూపుల సాక్షిగా/భారంగా దూరంగా కదిలిపోయావ్/నరాలు చిట్లి పోతున్నాయ్/ఆశల గూళ్లు విరిగి పోతున్నాయ్/ఇక నీ స్పర్శ కూడా ఒక స్వప్నమే

ప్రతులకు
ప్రజాశక్తి అన్ని పుస్తకషాపులు మరియు
గవిడి అనురాధ
గవిడి సూర్యనారాయణ
గాతాడ, మర్రివలస
రాజాం
విజయనగరం
పిన్ నెం. 532127

నిజంగా మానవ సంబంధాల గూర్చి, ఎడబాటు గూర్చి ఎంత కవిత్వం రాసినా చాలదు. 36 కవితల "కన్నీళ్ళు సాక్ష్యం" సంపుటిలో గవిడి శ్రీనివాస్ వస్తు విస్తృతిని సాధించాడు. తీసుకున్న వస్తువును మంచి అభివ్యక్తీకరణతో కవిత్వీకరించడంలో ఈయన విజయం సాధించాడు.

ఈ సంపుటి ఒక కన్నీటి అనుభూతికి గురి చేసే కవిత్వం. ముందుమాటలో డా॥ అద్దేపల్లి అన్నట్టు శ్రీనివాస్‌కు వస్తు వాస్తవికతుంది. అభివ్యక్తి, ఏకాగ్రత ఉన్నాయి. ఈ రెండిటి ద్వారా వచ్చిన రూప విభిన్నతుంది.

- మోతుకూరు శ్రీనివాస్

పురోగమిస్తున్న విప్లవం క్యూబా

క్యూబా పరిణామాల తాజా సమాచారాన్ని అందిస్తుందీ పుస్తకం. క్యూబా చరిత్రను, విప్లవ పథాన్ని క్లుప్తంగా వివరిస్తూ ఆరంభమయ్యే ఈ గ్రంథం సోవియట్ యూనియన్ పతనం, తదనంతరం ఆ దేశం నుండి లభించే మద్దతు నిలిచిపోవడంతో ఏర్పడిన క్లిష్ట పరిస్థితిని తట్టుకొని నిలబడటాన్ని ప్రధానంగా విశ్లేషిస్తుంది. క్యూబా అమెరికా సంబంధాల పరిశీలన సహజంగానే ప్రముఖ స్థానం ఆక్రమిస్తుంది. ఈ 'పురోగమిస్తున్న విప్లవం క్యూబా'లో కెనడాకు చెందిన ఇసాక్‌సానీ హాలీఫ్యాక్స్‌లోని డల్‌హౌసీ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు. క్యూబా పరిణామాలను నిరంతరం పరిశీలిస్తూ, పరిశోధిస్తూ వాటిపై ప్రసంగాలు, రచనలు చేస్తుంటారు.

అనువాదకులు : డి. ఆర్.కె. రెడ్డి, సఫ్దర్ అహ్మద్
ప్రతులకు : ప్రజాశక్తి అన్ని పుస్తకషాపులలో లభించును
పేజీలు 192, వెల : 76/-

మంచి కథల మారాజు

తొలితరం తెలంగాణా రచయిత గూడూరి సీతారాం చేసిన సాహిత్యసేవ చెప్పుకోదగ్గది. తెలంగాణా పల్లె వాతావరణాన్ని, భాషామాధుర్యాన్ని తెలుగు సాహితీ ప్రియులకందించిన గూడూరి కథలను నేటి తరం సాహితీ ప్రియులు తప్పక చదవాలి. తెలంగాణాలో నాటి పరిస్థితులు, నెలకొన్న కరువు, మాసిన బతుకుల జీవన చిత్రం, పల్లె బతుకుల్లోని ఒడిదుడుకులు గూడూరి కథల్లో కళ్లకు కట్టినట్లుంటాయి. సినారేతో కలిసి భావాల్ని పంచుకునే అవకాశం గూడూరికొచ్చింది. సాహితీ ప్రక్రియల్లో సినారేది కవితా మార్గం కాగా గూడూరిది కథామార్గం. ఎవరి ప్రక్రియల్లో వాళ్లే దిట్టలు అనదగ్గ సాహిత్య సేవ చేశారు. కాకపోతే సినారేకు వచ్చిన గుర్తింపు గూడూరికి రాలేదు. కనీసం ఇప్పటికైనా గూడూరి కథల్ని చదివే అదృష్టం తెలుగు పాఠకులకు కలిగించారు మానేరు రచయితలు. గూడూరి రాసిన ఎనభై ఐదు కథల్లోంచి కొన్నింటిని ఆయన సాహితీ జీవిత స్వర్ణోత్సవం సందర్భంగా తీసుకొచ్చారు. అదే సందర్భంలో అనేక మంది సాహిత్య ప్రముఖులు గూడూరి గురించి రాసిన అభినందన వాక్యాల్ని, ఆయనతో గల అనుభవాలను, గత స్మృతుల్ని 'కానుగ చెట్టు'గా తీసుకొచ్చారు.



కానుగ చెట్టు
వెల 30/-,
పేజీలు 122
సం॥ పత్తిపాక మోహన్

ఈ పుస్తకం నిండా గూడూరి సీతారాం ఆత్మ పరుచుకుంది. 'తెలంగాణా' అనగానే మట్టి వాసనలు, అమాయకమైన జన జీవితాలు, తమదైన జీవితం కోసం వారు చేసిన పోరాటాలే గుర్తొస్తాయి. గూడూరి కథల్ని చదవుతుంటే తెలంగాణా చరిత్ర చదువుతున్నట్లు, ఆనాటి సామాన్య ప్రజలతో కలిసి మాట్లాడుతున్నట్లు అన్పిస్తుంది. ఆయన కథల్లోని కరువు వలసలు నేటికీ తెలంగాణాలో మనం చూస్తున్నాం. ఇది ఏభైఎనిమిదేళ్ల స్వాతంత్ర్య చరిత్రను వెక్కిరిస్తున్నట్లన్పిస్తుంది. మరాజు, రంగడు, పిచ్చోడు వంటి కథలను చదివితే తెలంగాణా పల్లెలపై పాలకుల నిర్లక్ష్యం ఉందనిపిస్తుంది. 'తెలంగాణా భాష, యాస, సంస్కృతికి తెలుగు సాహిత్యంలో సరైన స్థానం కల్పించబడటంలో పాలకుల కుట్ర ఉంది' అని ఆ ప్రాంత సాహితీకారులు అనడం సమర్థనీయమే.

"తెలంగాణా కథలకు బయటి నుంచి గుర్తింపు రాలేదంటే కొంత పాపం మన దగ్గరా ఉంది" అన్న డా॥ ముదిగుంట సుజాతారెడ్డి మాటలతో ఏకీభవించడానికి ప్రతికూల అంశాలేవీ కన్పించవు. ప్రచార ఆర్భాటాలు లేని పల్లె సంస్కృతిని నేటికీ కథల రూపంలో దాచుకునే అదృష్టం 'గూడూరి' సాహిత్యం వల్ల వచ్చిందని చెప్పడంలో ఎలాంటి సందేహాలూ ఉండవు.

జింబో అన్నట్లు "తెలంగాణా భాషని సమర్థవంతంగా వాడుకున్న కథకుడు సీతారాం". తెలంగాణాలో చిద్రమవుతున్న కులవృత్తులను తన కథల్లో తడిమారు గూడూరి. వృత్తికీ, మట్టికీ దూరమైన బతుకులను తన కథల ద్వారా తెలుగు దేశానికి పరిచయం చేసిన గూడూరి సీతారాంను ఆలస్యంగానైనా సత్కరించడం సంతోషం. ఇది తెలంగాణా సాహిత్యానికి లభించిన సత్కారంగా ఆయన మిత్రులు భావించడంలో నిజముంది. కాకపోతే గూడూరి కథలనూ, వాటిలోని పాత్రలనూ ఏదో ఒక ప్రాంతానికి మాత్రమే చెందినట్లుగా కట్టిపడేయడం పాఠకులకూ, సాహితీ అభిలాషులకూ మింగుడు పడని విషయం. సాహిత్యమెప్పుడూ సార్వజనీనమైంది. అలాగే గూడూరి కథలు తెలుగునాట ప్రతి పల్లెలోని మట్టి మనుషులనూ మోసుకొచ్చాయి. వీటిని నాలుగుదిశలా విస్తరింపచేయాలిగానీ, ఇరుకుగదిలో బంధించరాదు. ఏమైనా మంచి కథల మారాజుని మందికి పరిచయం చేయడం మహదానందించదగ్గ విషయం.

- సైదులు ఐనాల

21.8.2005 నుంచి
27.8.2005 వరకు

హ్యాపీ బర్త్‌డే

పెద్దబాబు-చిన్నబాబు
2సం॥, 25.8.2003
మంగతాయారు-నాగేశ్వరరావు
తాడేపల్లిగూడెం-ప॥గో॥

ఎ. ప్రవల్లిక
5సం॥, 21.8.2000
స్వరూప-యాదయ్య
కరీంనగర్

టి. ఐశ్వర్య
9సం॥, 26.8.1996
లక్ష్మి-రఘు
మిర్యాలగూడ-నల్లగొండ

గమనిక: పదేళ్ల వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన తేదీకి 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. e mail: ద్వారా కూడా ఫొటోలు పంపవచ్చు. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:
హ్యాపీ బర్త్‌డే, స్నేహ, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
1-1-298/4, స్ట్రీట్ నెం.1,
అశోక్ నగర్, హైదరాబాద్-20
e mail: happybirthday_prajasakti@yahoo.com

హర్షవర్ధన్
5సం॥, 26.8.2000
సరళ-శ్రీనివాస్
పాణ్యం-కర్నూలు

ఎ.సూజిత
ఆగస్టు-26
సునంద-మహర్షి
గజ్జలకొండ-ప్రకాశం

ఎన్. శ్రీహర్ష
7సం॥, ఆగస్టు-1998
లక్ష్మి-వెంకటేశ్వరరావు
నిప్పట్లపాడు-ప్రకాశం



ఎస్.వంశీ(మింటు)
1సం॥, ఆగస్టు-2004
రాధిక-శ్రీధర్
కాశిబుగ్గ-వరంగల్

విద్యుత్‌తేజ(పండు)
5సం॥, ఆగస్టు-2000
పద్మ-గిరిప్రసాద్
భద్రాచలం-ఖమ్మం

రమ్య-ప్రవీణ్‌కుమార్
శారద-హేమసుందరరావు
రణస్థలం-శ్రీకాకుళం

వర్షిత(పింకి)
3సం॥, ఆగస్టు-2002
పద్మజ-గిరిప్రసాద్
భద్రాచలం-ఖమ్మం

కె. హర్షిత
1సం॥, ఆగస్టు-2004
కృష్ణవేణి-రాజేష్ గౌడ్
కేశవరము-రంగారెడ్డి

టి. మనీషా
జ్యోతి-కొండలరావు
ఖమ్మం

ఝాన్సీలక్ష్మీబాయి
3సం॥, ఆగస్టు-2002
అరుణ-బాలకృష్ణ
పాతకుంక-శ్రీకాకుళం

కె. వంశీధర్‌రెడ్డి
1సం॥, ఆగస్టు-2004
సుధారాణి-మహేంద్రరెడ్డి
పెనుబల్లి-నెల్లూరు

వై. లక్ష్మీప్రణవి
1సం॥, ఆగస్టు-2004
నాగజ్యోతి-నాగేశ్వరరావు
పొనుగుపాడు-గుంటూరు

ఉమేష్‌చంద్ర
జ్యోతి-చక్రపాణి
పైడిభీమవరం-శ్రీకాకుళం



పి. రఘు(సాయికృష్ణ)
8సం॥, ఆగస్టు-1997
ప్రమీలమ్మ-బాలయ్య
వనపర్తి-మ॥నగర్

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్:

కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : వి.అనూష
వయసు : 13 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు: క్రికెట్, టీవీ చూడడం, డ్యాన్స్ చేయడం.
స్కూలు : మహర్షి పబ్లిక్ స్కూల్
చిరునామా : వి.అనూష, డాటరాఫ్ వెంబడి కళావతి, పూజా హాస్పిటల్ దగ్గర, పోరుమామిళ్ల గ్రామం, కడప.

పేరు : వి.సందేశ్
వయసు : 14 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు: కవిత్వం రాయడం.
స్కూలు : జివిఆర్ మోడల్ పాఠశాల
చిరునామా : వి.సందేశ్, సన్నాఫ్ ఉప్పల శ్రీనివాస్ (అడ్వకేట్), ఎపిహెచ్‌బి కాలనీ.

పేరు : ఎం.శ్రావణ్‌కుమార్
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు: క్రికెట్ ఆడడం,
స్కూలు : సరస్వతి విద్యాలయం
చిరునామా : ఎం.శ్రావణ్‌కుమార్, సన్నాఫ్ శేఖర్, ఆత్మకూర్, నల్గొండ -508111.

పేరు : సాలె శిరీష (సిరి)
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు: పుస్తకాలు చదవడం, పాటలు పాడడం, క్యారమ్స్ ఆడడం.
చిరునామా : సాలె శిరీష (సిరి), డాటరాఫ్ నాగేశ్వరరావు, కోదాడ, నల్గొండ.

పేరు : తిరువాయిపాటి అంజలి,
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు: కంప్యూటర్ గేమ్స్ ఆడడం, పుస్తకాలుచదవడం
లక్ష్యం: డాక్టర్ కావడం
చిరునామా : తిరువాయిపాటి అంజలి, డాటరాఫ్ టి.మూర్తి (అడ్వకేట్), మహల్, కలికిరి, చిత్తూరు.

పేరు : దుస్సా అక్షయ్‌కుమార్
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు: ప్రజాశక్తిలో 'చిన్నారి' చదవడం, టీవీలో టూన్‌డిస్నీ చూడడం.
స్కూలు : సెయింట్ మేరిస్ హైస్కూల్
చిరునామా : దుస్సా అక్షయ్‌కుమార్, సన్నాఫ్ జగదీశ్వర్, ఇం.నెం.2.5.2/6/ఎ, బీరప్ప టెంపుల్ రోడ్, జనగామ -506167.